గెడా రంగారావు

సముద్రపు కుక్కలు

సుజనశ్రీ

ప్రఖ్యాత రచయిత నారాయణరావు సీట్ బెల్ట్ ని విప్పేసి, ఫ్రీగా కూర్చున్నాడు. హెరాల్డ్ రాబిన్స్ నవల తెరిచాడు.

ఎయిర్ హోస్టెస్ ఓవల్టిన్, బిస్కట్లూ సర్వ్ చేసింది.

నారాయణరావు ఓవల్టిన్ సిప్ చేస్తున్నాడు నవలలోకి చూస్తూనే! అంతలోనే విమానం కుదుపుతో జర్క్ ఇచ్చింది. ఓవల్టిన్ ఒలికిపోయి అతడి ప్యాంటు మీద పడింది.

నారాయణరావు చిరాగ్గా తల త్రిప్పి చూశాడు. విమానంలో మిగతా ప్రయాణీకులకు తనకు జరిగిన అనుభవమే జరిగినట్టుగా తెలుసుకున్నాడు.

కొందరు ఆత్రుతగా "హలో మిస్! ఎయిర్ హోస్టెస్ ప్లీజ్! ఏం జరిగింది?" అని అరిచారు.

ఒకరిద్దరు స్త్రీలు పెద్దగా ఏడ్వసాగారు.

ఎయిర్ హోస్టెస్ ఓపిగ్గా అందరికీ ధైర్యం చెబుతోంది. "మరేం ప్రమాదం లేదండీ! విమానంలో ఏదో చిన్న ట్రబుల్ ఏర్పడింది. అంతే! త్వరలోనే దాన్ని పైలట్లు సరిచేస్తారు."

విమానంలోని ప్రయాణీకులు కొందరు బిత్తరబోయి చూస్తుంటే, మరికొందరు ప్రార్థనలు చేస్తున్నారు. ఆడ ప్రయాణీకులయితే ఏడ్పు మానలేదు హోస్టెస్ ఓదార్చినా.

ఆ గలభా చూసి నారాయణరావు బ్రాన్పడిపోయాడు. తన జీవితం గూడ అవసానదశకు చేరుకుందా? నిన్ననే మాసపత్రికకు కథ రాసి పోస్టు చేశాడు. అదే తన ఆఖరు రచన అవుతుందా? ఆ రచన ప్రచురితమయేసరికి తను కీర్తి శేషుడౌతాడా?

విమానం కుడిప్రక్క రెక్కలో ఇంజన్‌కి నిప్పంటు కుంది. పైలట్లు ఎంత నేర్పుతో బ్యాలెన్స్ చేసినా, విమానం ఒక ప్రక్కకు వాలింది. దెబ్బతిన్న పక్షిలా రివ్వున నేలమీదకు దూసుకుపోతోంది.

విమానం లోపల ప్రయాణీకులు అటూ ఇటూ ఊగి పోతూ, తల్లడిల్లుతున్నారు. రోదనలూ, ఆక్రందనలతో నానా భీభత్సంగా ఉంది. రేడియో ఆఫీసరు గ్రాండ్ కంట్రోల్‌ని కాంటాక్ట్ చేయటంకోసం అదేపనిగా అరు స్తున్నాడు గొంతు చించుకొని!

విమానం అతివేగంగా వెళ్ళి నీళ్ళను ఢీకొంది. ఉవ్వెత్తున నీళ్ళు లేచినయ్. విమానం నీళ్ళలోకి మునిగింది. మళ్ళీ అదే

వేగంతో మరి కొద్ది క్షణాల్లో పైకి తేలింది. అప్పటికి విమానం ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది.

2

నారాయణరావు కళ్ళు మూసుకున్నాడు. విమానం సముద్రపు నీళ్ళలో క్రాష్ అయేసరికి అతడు తన చేతి కందిన వస్తువుని గట్టిగా వాటేసుకున్నాడు.

ఆఖరు ప్రార్థనగా భగవంతుడ్ని స్మరించాడు నారాయణ రావు.

నారాయణరావు కళ్ళు తెరిచాడు, ఎదురుగా చిత్ర గుప్తుడ్నీ, యమధర్మరాజునీ చూడటానికి సంసిద్ధుడై. పవిత్ర సాహిత్యాన్ని విస్మరించి కేవలం డబ్బుకోసమే అశ్లీల రచనలు చేసినందుకుగాను తన పేరు చిత్రగుప్తుడి చిట్టాలో పాపాత్ముల కోవలోనే ఉంటుంది తప్పకుండా, అనుకుంటూ చుట్టూ కలయజూశాడు.

చుట్టూరా ఆకుపచ్చ రంగులో అనంతమైన సాగరం, పైన నీలాకాశమూ కనుపించాయి. సూర్యుడు నడినెత్తిన ప్రకాశిస్తున్నాడు.

అతడి చేతులు దేన్నో బలంగా వాటేసుకుని ఉన్నాయ్. అదేమిటా అని ఆశ్చర్యంగా చూశాడు. విమానం సీటు పన్న కుషన్ అది. నాలుగడుగుల పొడవూ, ఒకటిన్నరడు గుల వెడల్పుతో చిన్నసైజు పరుపులా ఉంది. రెకిన్‌తో కుట్టిన దట్టమైన యూఫోమ్ దవటంవల్ల అది నీళ్ళమీదికి తేలింది. దానితోపాటు తనూ నీళ్ళమీద తేలుతున్నాడు.

విమాన ప్రమాదం జరిగిపోయి ఎంత టైమ్ గడిచిందో ఊహించటానికి యత్నించాడు. కానీ, అతడికి అంతా అగమ్యగోచరంగా ఉంది. విమాన శకలాలుగానీ, తోటి

ప్రయాణీకుల శవాలుగానీ మచ్చుకైనా గోచరించలేదు అతడికి.

తను ఇంకా బ్రతికి ఉన్నాడా అనే సంశయం పోనే లేదు నారాయణరావుకి.

కాలం గడిచేకొద్దీ నీళ్ళపైన తేలుతున్న శరీరభాగం ఎండ వేడికి మాడిపోతున్నది. నీళ్ళలో మోకాళ్ళ క్రింది భాగం మునిగి ఉన్నయ్. ఆ భాగం అంతకంతకూ చల్లబడు తూన్నట్లుగా ఉంది.

తనీ పరిస్థితిలో ఎంత సేపని తట్టుకోగలడు? మరికొద్ది సేపట్లో కడుపులో ఆకలి మొదలవుతుంది. దాహం వేసి నోరు పిడచకట్టుకుపోతుంది. విమానం ఏక్సిడెంట్ లోనే హాయిగా చావకుండా, ఈ చిత్రహింస, దారుణమరణం ఏమిటి తనకు అనుకున్నాడు నారాయణరావు.

సాయంత్రమవుతుండగా కనుచూపుమేరలో సముద్రత మీద తెల్లని తెరచాప కనుపించింది అతడికి. నారాయణ రావుకి ప్రాణం లేచి వచ్చింది.

ఆ తెరచాప వస్తున్న వేపుకే చూడసాగాడు ఆశగా.

క్రమేపీ ఆ తెల్లని తెర ఏదో నౌకది అయివుంటుందని అతడికి అర్థం అయింది.

మరో అరగంట గడిచేసరికి ఆ నౌక బాగా చేరువలోకి వచ్చింది.

డెక్ మీద స్టీరింగ్ వీల్ పట్టుకుని ఒక వ్యక్తి ముందుకే చూస్తూ నిలబడ్డాడు. మరో వ్యక్తి రెయిల్స్ మీదుగా వంగి నీళ్ళల్లోకి చూస్తూ సిగరెట్ త్రాగుతున్నాడు.

నారాయణరావు తన జేబులో చెయ్యి పెట్టాడు. ఎర్రగళ్ళ జేబురుమాలుని బయటకు లాగాడు. దాన్ని గాలిలో ఊపుతూ పెద్దగా అరిచాడు.

అతడి ఆరుపుల్ని సిగరెట్ త్రాగుతున్న వ్యక్తి విన్నాడు. వెంటనే అతడు వీల్ ముందున్న వ్యక్తి వంకకు తిరిగి ఏదో చెప్పాడు, చూపుడు వ్రేలితో తనను చూపుతూ.

నౌక గమ్యం మళ్ళింది. నారాయణరావుకి ప్రక్కగా వచ్చింది. నౌక డెక్ మీదనుంచి త్రాళ్ళు విసిరారు.

త్రాడుని రెండు చేతుల్తో గట్టిగా పట్టుకున్నాడు నారాయణరావు.

3

నారాయణరావుకు పొగలు గక్కుతున్న వేడి కాఫీ అందించారు.

నారాయణరావు కాఫీ త్రాగాడు. అతడికి ఊపిరి చేరుకుంది.

"నే నెక్కడున్నాను? ఈ నౌక ఏ దేశానిది? ఎక్కడకు వెడుతోంది?" ఆతృతగా అడిగాడు నారాయణరావు.

"ఇది ఈస్ట్ ఇండియా దీవులకి సంబంధించింది. ఈ నౌక పేరు 'సీ డెవిల్.' సముద్రంలో 'సీల్' జంతువుల్ని వేటాడే నౌక ఇది!" ఆ చెప్పిన వ్యక్తి ఆ నౌకకు చెందిన నావికుడని గ్రహించాడు నారాయణరావు.

"ఈ నౌక కెప్టెన్ ఎవరు? అతడితో నేను మాట్లాడాలి!" అంటూ లేచి కూర్చున్నాడు నారాయణరావు.

నల్లగా మాసిన దుస్తుల జతను తెచ్చాడు మరో నావికుడు. "ముందు మీ తడిబట్టల్ని విప్పండి! ఈ పొడి దుస్తులు ధరించండి!"

"కృతజ్ఞుడ్ని! నీ పేరేమిటి తెలుసుకోవచ్చా?"

"నా పేరు థామస్! నేనీ నౌకలో కుక్ ని! వంట వాడ్ని!"

నారాయణరావు చుట్టూ చేరిన వాళ్ళు తలో వైపూ వెళ్ళిపోయారు.

నారాయణరావు లేచి నిలబడ్డాడు. డెక్ మీద మరో మూల చిన్న గుంపు కనిపించింది. అటుగా వెళ్ళాడు. జనం మధ్యలోకి తొంగి చూశాడు.

నేలమీద బలిష్ఠమైన వ్యక్తి పడుకుని ఉన్నాడు. అతడి ఒంటిపైన ఉన్న దుస్తులు పేలికలై ఉన్నాయి. గుండెలమధ్య దట్టంగా రోమాలు పెరిగి ఉన్నయ్. అతడు కళ్ళు మూసుకుని ఉన్నాడు. మరో నావికుడు అతడి ముఖం మీదకు బకెట్ తో నీళ్ళను క్రుమ్మరిస్తున్నాడు క్షణక్షణానికీ.

ఆ నౌక కెప్టెన్ లార్సన్ సిగరెట్ త్రాగుతూ నేల మీద పడివున్న వ్యక్తి వంకే చూస్తున్నాడు. అతడు ఆజానుబాహువు. కండలు తిరిగిన దేహం. కోరమీసాలు. ఎర్రబారిన కళ్ళు! 'డెవిల్' నౌకకు తగిన కెప్టెన్ లా ఉన్నాడు.

కెప్టెన్ లార్సన్ ఏదో బూతులు తిట్టసాగాడు. అతడు తిడ్తూన్న దాన్నిబట్టి, క్రిందపడి ఉన్న వ్యక్తి నౌక 'మేట్' అనీ, అతడు అతిగా త్రాగి పడిపోవడంవల్ల నౌకకు మరో మేట్ లేకుండా పోయాడనీ, అందుకే కెప్టెన్ అలా అగ్గిమీద గుగ్గిలం అవుతున్నాడనీ గ్రహించాడు నారాయణరావు.

మరికొందరు డెక్ రెయిల్స్ దగ్గర అక్కడక్కడా చేరి తమకేం పట్టనట్టుగా మాట్లాడుకుంటున్నారు. వారంతా సీల్ జంతువుల్ని వేటాడే వేటగాళ్ళనీ, మామూలు

నావికులకన్న వాళ్ళ హోదా కొంచెం ఎక్కువనీ తర్వాత తెలుసుకున్నాడు నారాయణరావు.

"ఇక ఏం లాభం లేదు! చచ్చిపోయాడు!" అనరిచా రెవరో.

కెప్టెన్ లార్సన్ ప్రక్కకు తిరిగాడు. వంటజేసే థామస్ అతడి కంటబడ్డాడు.

"ఒరేయ్! చూశావుగా! ఒక మేట్ చచ్చిపోయాడు. వాడి స్థానాన్ని నీవు భర్తీ చేయాలి. నీవూ అతిగా త్రాగి చావకుండా బ్రతికేడువు? తెలిసిందా?" కెప్టెన్ లార్సన్ కర్కశంగా అన్నాడు.

"అలాగే సార్!" థామస్ డెక్ మెట్లుదిగి వంటశాల వైపుకు వెళ్ళిపోయాడు.

"శవానికి అంత్యక్రియలకు ఏర్పాటు చేయండి!" అంటూ కెప్టెన్ లార్సన్ అక్కడనుంచి ఇవతలకు వచ్చాడు.

అప్పుడే నారాయణరావు కెప్టెన్ ఎదుటపడ్డాడు. వెంటనే కెప్టెన్‌కి అభివందనం చేశాడు. "మాది భారత దేశం! నేను రచయితను!" అని పరిచయం చేసుకున్నాడు కెప్టెన్‌కి.

4

కెప్టెన్ గలగల నవ్వాడు. "ఏమిటీ రచయితవా నీవు? అంటే కష్టపడి కానీ సంపాదించలేవన్న మాట! మీ నాన్న బాగా సంపాదించి ఉండాలి! అది తింటూ ఎందుకూ కొరగాని వ్రాతలు రాస్తున్నావన్న మాట! మీ లాంటి వాళ్ళు ఈ నౌకలో కంచాలు కడగడానికి తప్ప మరెందుకూ పనికిరారు!" అన్నాడు.

"నా గురించి మీరు శ్రమ తీసుకోనక్కర్లేదు! వీలైనంత త్వరలో నన్ను ఏదో దేశంలో దింపండి!"

"ఈ నౌకలోకి వచ్చిన వాళ్లెవరూ, తిరిగి ప్రాణాలతో బయట పడలేదు తెలుసా? అదీగాక నా సిబ్బందిలో ఒక 'మేట్' చనిపోయాడు. ఒక నావికుడు అతడి స్థానాన్ని భర్తీ చేస్తాడు. కేబిన్‌లో పనిచేసే బోయ్ నావికుడౌతాడు. కేబిన్ బోయ్ స్థానానికి ఒక మనిషి అవసరం. ఊరికే చేయనక్కర్లేదులే తిండిపెట్టి నెలకు అయిదు పౌండ్లు ఇస్తాను."

నారాయణరావుకి కోపం ముంచుకు వస్తున్నది. అయినా తను నిస్సహాయుడు. 'సీ డెవిల్' నౌక కెప్టెన్ నిజంగానే నరరూప రాక్షసుడిలా ఉన్నాడు. తన చేతికి చిక్కిన మనుష్యుల్ని బానిసలుగా చేసేస్తున్నాడు. వీడి బారినుంచి బయటపడటం ఎలాగ?

ఏదో సైరన్ మ్రోత వినబడింది. నారాయణరావు అటుగా చూశాడు. చేరువగా మరో నౌక వస్తోంది.

"ఒరేయ్ థామస్! కేబిన్ బాయ్‌ని ఇలా కేకెయ్యి!" లార్సన్ అరిచాడు.

కేబిన్ బాయ్‌ని వెంటబెట్టుకుని థామస్ వచ్చాడు.

"ఒరేయ్ హాసన్! నీ వీ రోజునుంచి నావికుడివి. తెలిసిందా?"

"కానీ నావికుడి విధుల్ని ఎలా నిర్వర్తించాలో నాకు తెలియదే! నన్ను క్యాబిన్‌లోనే వుంచండి సార్!"

కెప్టెన్ లార్సన్‌లోని రాక్షసత్వాన్ని తొలిసారిగా చూసాడు నారాయణరావు.

క్యాబిన్ బోయ్‌కీ, కెప్టెన్‌కీ మధ్య మూడడుగుల దూరం ఉంది. కెప్టెన్ ముందుకి ఒక్క అంగ వేసి, పిడికిలి

బిగించి బోయ్ పొట్టలో గుద్దాడు.

నూట అరవై పౌన్ల బరువున్న బోయ్ ఫుట్ బాల్ లాగ ఎగిరి అల్లంత దూరంలో క్రింద పడిపోయాడు. బాధతో అతడు మెలికలు తిరిగిపోతున్నాడు. డెక్ మీదున్న వాళ్ళు బోయ్‌ని చూసి పకపక నవ్వుతున్నారు. ఎవరైనా చావు దెబ్బలు తిని బాధతో రోదిస్తుంటే, వాళ్ళకు వినోదమల్లే ఉంది.

ఇందాక సైరన్ వినిపించిన నౌక బాగా చేరువ అయింది. 'సీ డెవిల్'కి ప్రక్కగా ముందుకు సాగిపోతోంది.

గబగబా డెక్ చివరకు పరుగెత్తాడు నారాయణరావు. రెయిల్స్‌కి ఆనుకుని నిలబడి పెద్దగా అరిచాడు "ఆపండి! నౌకను ఆపండి! నేనూ అందులోకి వస్తాను. నన్ను రక్షిస్తే వెయ్యిరూపాయలిస్తాను."

అతడి మాటలు అవతలి నౌకలోకి వినిపించినయ్. అందులోనుంచి మరో వ్యక్తి బదులుగా అరిచాడు. "ఏమిటి నువ్వనేది? నిన్ను రక్షించాలా? అందుకు వెయ్యిరూపాయలిస్తావా?"

ఎక్కడో నిల్చునివున్న కెప్టెన్ లార్సన్ గభాలున అక్కడకు వచ్చాడు.

"అతడు మస్తుగా త్రాగివున్నాడు. అతడి మాటల్ని లక్ష్యపెట్టకండి!"

అవతలి నౌకలోని వ్యక్తులు నారాయణరావుని చూసి హేళనగా నవ్వారు.

ఆ నౌక 'సీ... డెవిల్'ని దాటుకుని వెళ్ళిపోయింది.

కెప్టెన్ లార్సన్, నేలమీద పడివున్న కేబిన్ బోయ్ దగ్గరకు నడిచాడు.

"ఏంరా? నే చెప్పినట్టు చేస్తావా? మరోటి వడ్డించ మంటావా?"

"వద్దు బాబోయ్! మీరే పని చేయమంటే అదేచేస్తాను సార్!" కేబిన్ బోయ్ లబోదిబో కొట్టుకున్నాడు.

"ఇక నీ సంగతి ఏమిటి?" కెప్టెన్, నారాయణరావు వైపుకి తిరిగి అడిగాడు.

"నన్ను ఏదో దేశం చేరిస్తే, మీకు వెయ్యిరూపాయలు బహుమానమిస్తాను సరా!"

"నే చెప్పినట్టు నడుచుకుంటావా? లేక వాడికి జరిగిన మర్యాదే నీకూ జరగాలా?"

నారాయణరావు భీతితో కెప్టెన్ కళ్ళలోకి చూశాడు.

"ఏం మాట్లాడవు?" కెప్టెన్ మరోసారి గర్జించాడు.

తను కాదంటే అక్కడికక్కడే కొట్టి చంపగలరు వీళ్ళు. మానవతా విలువలు తెలిసినట్టు లేవు వీళ్ళకు. ఎంత సేపటికీ హింసాకాండ దౌర్జన్యం చేయడమే తెలుసు వీళ్ళకు.

"అలాగేనండీ! మీరేం చెయ్యమంటే అదే చేస్తాను!" తడారిపోయిన గొంతుని పెగల్చుకుని బదులిచ్చాడు నారాయణరావు.

"నీ పేరేమిటి?"

"నారాయణరావు!"

"అంత పేరు మాకు నోరు తిరగదు! రావ్ అని పిలుస్తాను. నీ వయసెంత?"

"ముప్ఫయ్ అయిదు సంవత్సరాలు!"

"సరే! వంటశాలకు వెళ్ళు. పని ఎలాచేయాలో శ్రద్ధగా నేర్చుకో! వంటకాలు పాడయాయో, నిన్ను వలుచుకు తింటాను."

నారాయణరావు నిశ్చేష్టుడై అలాగే నిల్చుండి పోయాడు.

5

సముద్రంమీద గాలి వీచసాగింది. కెప్టెన్ లార్సన్ పెద్దగా అరుస్తూ ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. నావికులు త్రాళ్ళను లాగుతున్నారు. తెరచాపలు ముడుచుకు పోతున్నాయ్.

ఒక్క క్షణం క్రితం డెక్ మీద సంభవించిన మరణాన్ని గురించి కానీ, అక్కడ జరిగిన హింసాకాండను గానీ ఎవరూ పట్టించుకున్నట్లు లేదు. ఇలాంటివి రోజూ సర్వసాధారణంగా జరిగేవిలా ఉదాసీనత చూపారు అక్కడున్న వ్యక్తులు.

'సీల్' వేటగాళ్ళు ఏవో కథలు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. నావికులు తుఫానుని ఎదుర్కొనే సన్నాహంలో వున్నారు. కెప్టెన్ లార్సన్ పెద్దగా అరుస్తూ ఆజ్ఞలు జారీ చేస్తున్నాడు. ఆకాశంలోకి చూస్తూ, తుఫానుని అంచనా వేస్తున్నాడు.

నారాయణరావు వంటశాలలోకి వెళ్ళాడు థామస్ వెంట. థామస్ క్షణాల్లో మారిపోయాడు. నారాయణ రావుని తన స్వంత నౌకరులా భావించి అతడిమీద పెత్తనం చెలాయించసాగాడు.

సముద్రంమీద తుఫాను తీవ్రతరం అయింది. ఆ తాకిడికి నౌక అటూ ఇటూ ఊగిపోతోంది. నారాయణరావుకి నిలద్రొక్కుకోవడం కష్టమైపోయింది. కెప్టెన్ గదిలోకి టీ తీసుకువెడుతూ, వాననీళ్ళతో తడిసివున్న చెక్క నేలపై కాలు జారి బోర్లా పడిపోయాడు. మోకాలుచిప్పకు

బలమైన గాయమైంది. కాలు విరిగిపోయిందనే అను కున్నాడు నారాయణరావు.

అతడి వెనుకే శాపనార్థాలు పెట్టుకుంటూ వచ్చాడు థామస్. "నీ పుచ్చె పగులగొట్టా! సరిగా నడిచి చావ లేవూ? నీవు టీ తీసుకెళ్ళటానికి పనికిరాకపోతే ఇక ఈ నౌకలో నీ వింకేం చేసి చస్తావూ?"

వంటశాలలో వడ్డించటం గూడ తేలికనిపించలేదు నారాయణరావుకి.

ఆ రాత్రి హాసన్ అతడి గాయానికి మందువేసి కట్టు కట్టాడు. అదే తన ఊళ్ళో అయితే, నారాయణరావు బెడ్ మీద హాయిగా విశ్రాంతి తీసుకునేవాడు. ఫ్యామిలీ డాక్టర్ పూట పూటా వచ్చి వైద్యం చేసేవాడు. ఏదో నవల చదువుకుంటూ తన బాధను మరిచిపోగలిగేవాడు.

కాలి గాయం బాధతో అతడికి రాత్రిళ్ళు సరిగా నిద్ర పట్టలేదు. ఈ నౌకలోనివాళ్ళకు రక్తపాతం అంటే లెక్క లేదు. హాసన్ వ్రేలికి గాయమయింది ఒకసారి. కానీ అతడు దాన్ని లక్ష్యపెట్టనే లేదు.

అయితే వీరంతా అతి స్వల్ప విషయాలకు తీవ్రంగా వాదించుకుంటారు. సీల్ గుడ్లను పెడుతుందని కొందరూ, కాదు పిల్లల్నే కంటుందని మరికొందరూ, అది తన పిల్లలకు ఈత నేర్పుతుందని కొందరంటే, మరికొందరు అది పుట్టుకతోనే ఈత నేరుస్తుందనీ కొట్లాడుకునేవారు.

నారాయణరావు తన స్థితికి విచారించాడు. స్వతహాగా అతడు దుర్బలుడు. సన్నగా, పీలగా వుంటాడు. స్పోర్ట్సని అంటే అసలే ఆసక్తి లేదు. సాహసం అంటేనే అతడు ఆమడదూరంలో వుంటాడు. కుర్చీలో కూర్చుని, టేబుల్ మీదకు వాలి ఆ స్తమానం ఏదో రాసుకునే సంపన్నవ్యక్తి

ఈనాడు సముద్రపు జంతువుల్ని వేటాడే నౌకలో వంట వాడై, బంగాళాదుంపలు పొట్టు తీయటం, కంచాలూ, గ్లాసులూ కడగటం చేస్తాడని ఎప్పుడూ ఊహించలేదు.

ఈ పాటికి భారతదేశంలో ప్రఖ్యాత రచయిత నారాయణరావు విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైనందుకు శ్రద్ధాంజలులు ఘటిస్తుంటారు తెలుగు ప్రజలు. స్మారక సభలు చేస్తుంటారు. తను చనిపోయినా బాగుండేది. జీవన్మృతు డయేవాడు. తన జన్మ నూటికి నూరుపాళ్ళా సార్థకం అయివుండేది, ఇలా జీవచ్ఛవంలా నివసించేకన్న!

కాలిబాధతో రాత్రంతా నిద్రపట్టలేదు అతడికి. ఎప్పుడో తెల్లవారుజామున కన్ను మూశాడో లేదో, థామస్ పెద్దగా అరుస్తూ, తిడుతూ లేపాడు, నారాయణరావుని.

నారాయణరావు వంటశాలలోకి వెళ్ళాడు. తన ఒంటిమీదున్న గుడ్డలు విప్పి, థామస్‌కి తిరిగి ఇచ్చేశాడు. పొడిగా ఆరిన తన డ్రెస్ వేసుకున్నాడు. అప్రయత్నంగా నారాయణరావు చేయి జేబులోకి పోయింది. అందులో తన డబ్బు అయిదువందలు మాయమయినై. ఏవో చిల్లర, ఒక రూపాయి నోటూ ఉన్నయ్ మరో జేబులో.

"నా జేబులో డబ్బు ఏమయింది?" నారాయణరావు అమాయకంగా అడిగాడు.

"పాపం గదా అని నా డ్రెస్ ఇస్తే, నాకే దొంగతనం అంటగడుతున్నావా? మరోసారి ఆ మాట అన్నావో నీ తల చితక్కొడతాను జాగ్రత్త!" అంటూ పిడికిళ్ళు బిగించి మీదకు వచ్చాడు థామస్.

అహింసకు ప్రతిరూపమయిన నారాయణరావు ఏం చేయగలడు? అక్కడ్నుంచి పారిపోయి, ఆ సమయానికి

తన్నులు తప్పించుకున్నాడు. కాలిబాధతో కుంటుతూ పారిపోతూన్న అతడ్ని చూసి మిగతావాళ్ళు విరగబడి నవ్వారు.

కాసేపయాక మళ్ళీ వంటశాల చేరుకుని తన పని చేసుకు పోసాగాడు నారాయణరావు.

6

క్యాప్టెన్ గది శుభ్రంచేసే పనికూడ నారాయణరావు మీదే పడింది. ఆ గదిలోకి వెళ్ళిన వ్యక్తి ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని చూశాడు.

క్యాప్టెన్ బెడ్ చుట్టూ పుస్తకాలు చిందరవందరగా పడివున్నయ్. షేక్స్పియర్ డ్రామాలూ, మిల్టన్ పొయట్రీ, సైన్స్‌కి సంబంధించిన పుస్తకాలూ, కొన్ని తెలుగు గ్రంధాలు సైతం అల్మారాలో వున్నయ్.

మానవత్వం లేని రాక్షసుడుగా ప్రవర్తించే లార్సన్ ఇన్ని గ్రంధాల్ని చదివాడా? బెడ్ మీదున్న పుస్తకాన్ని తెరిచి చూశాడు నారాయణరావు. అందులో కొన్ని పేజీల్లో అక్కడక్కడా పెన్సిల్‌తో అండర్ లైన్లు చేయ బడి వున్నయ్. అయితే క్యాప్టెన్ లార్సన్ విద్యాధికుడైన వింత పశువన్నమాట?

ఆ దఫా నారాయణరావు ధైర్యంగా క్యాప్టెన్ ఎదుట పడ్డాడు.

"నా జేబులో డబ్బు అయిదువందల రూపాయలు ఎవరో కాజేశారు!" అని ఫిర్యాదు చేశాడు.

"ఎప్పుడు పోయింది?" క్యాప్టెన్ తీరిగ్గా అడిగాడు.

తను నౌకలోకి వచ్చినపుడు థామస్ అతడి దుస్తు చ్చి, తన తడిగుడ్డల్ని తీసుకోవటమూ, డబ్బు పోయిందని

చెబితే థామస్ ఎలా కసురుకున్నదీ చెప్పాడు నారాయణ రావు.

"అంత డబ్బు గలవాడివి నిర్లక్ష్యంగా వదిలేస్తే ఎలాగ? లక్ష్యం లేనివాడివద్ద లక్ష్మి ఛస్తే నిలవదు తెలుసా?"

"ఇంతకీ నా డబ్బు తిరిగి నాకు చేరేదెలాగ సార్!"

"అదీ నీ తద్దినం! డబ్బుని అజాగ్రత్తగా పెట్టు కున్నావ్! అందువల్ల మరో వ్యక్తిలో ఆ డబ్బుని దొంగి లించాలన్న ఆలోచనను ప్రేరేపించావ్! అది నీవు చేసిన మరో తప్పు! ఇక వెళ్ళి పనిచూసుకో ఫో!"

అతడి కోపం చూసి నారాయణరావు అక్కడ్నుంచి ఇవతలకు వచ్చేశాడు.

7

థామస్ డెక్ మీదకు వెళ్ళి వీల్ ని పట్టుకుని నౌకను నడుపుతున్నాడు.

నారాయణరావు వంటలో నిమగ్నుడైనాడు. అక్కడికి మరో నావికుడు వచ్చాడు. అతడి పేరు అహమ్మద్! అహ మ్మద్ వట్టి వాగుడుకాయ! వినేవాడుంటే విసుగూ విరామం లేకుండా వాగుతూనే వుంటాడు, చెప్పింది చెప్ప కుండా.

"నీ వసలు ఈ నౌకమీదకు ఎందుకు వచ్చావయ్యా? ఈసారి వేట ముగిసేలోపలే ఇందులో ఉన్నవాళ్ళు చాలా మంది చచ్చిపోవటం ఖాయం! నరకం అనేది ఎక్కడో లేదు. ఇదే చిన్న నరకం అనుకో! సాగరగర్భంలో తేలి యాడే నీళ్ళమీది నరకం! కెప్టెన్ లార్సన్ లాంటి కిరాతకుడు ఏ మతంలోని పురాణాల్లోనూ దొరకడనుకో! అసలు ఈ నౌక 'సీల్' జంతువులను అంటే సముద్రపు కుక్కలను

వేటాడుతుంది. కాని అసలైన సముద్రపుపక్కి ఆ కెప్టెన్ గాడు. వాడిని వేటాడే మొనగాడు రావాలి.''

''అయితే వీరంతా ఈ హింసాకాండను ఎలా సహిస్తున్నారు?''

''అక్కడే వుంది గమ్మత్తంతా! నా దగ్గర పనిచేసే బోటు సరంగునే తీసుకో! వాడు వచ్చినప్పుడు ఆడపిల్లలాగుండేవాడు. ఒక ఏడాదిలోనే ఈ వాతావరణం వాడిలో మార్పు తెచ్చింది. వాడి చేతిమీదుగా ఇద్దర్ని హత్య చేశాడంటే నమ్ము!''

అదీ నిజమే అనిపించింది నారాయణరావుకి. తను కూడా ప్రస్తుతానికి పిల్లిలా సాధువుగానే వున్నాడు. కానీ అందరూ తనని చవటక్రింద జమకట్టి హేళన చేస్తున్నారు. ఆ థామస్‌గాడయితే ఒక్కక్షణం ఊరికే కూర్చోనివ్వడు. ఎప్పుడూ ఏదో పని పురమాయిస్తూనే వుంటాడు. ఈ వాతావరణంలో మరి కొద్దికాలం వుంటే, తనలోనూ హింసాప్రవృత్తి ప్రబలుతుంది. అహమ్మద్ ఉదహరించినట్టుగా, తనూ ఎవర్నో హత్య చేసి తీరాల్సి వస్తుంది.

ఆ రోజు ఉదయాన్నే ఉధృతమైన గాలి వీచసాగింది. ఆ గాలి సాగినప్పుడు ఎవరైనా తెరచాప స్తంభం పైకి ఎక్కి అక్కడ త్రాళ్ళు తెగిపోకుండా కట్టు దిట్టం చేసి రావాలి.

కెప్టెన్ లార్సన్ ఆ పనిని హసన్‌కి చెప్పాడు. హసన్ క్యాబిన్ బోయ్‌నుంచి నావికుడుగా వచ్చినవాడు. తెరచాప స్తంభం పైకి చూస్తూంటేనే అతడు భయంతో వణికి పోతున్నాడు. దాదాపు ఎనభై అడుగుల ఎత్తున్న

స్తంభం శిఖరాగ్రానికి వెళ్ళి, క్రిందకు చూస్తే, ఎంత ధైర్యస్థుడయినా, కొత్తవాడికి గుండెలవిశిపోతాయి.

లార్సన్ కళ్ళెర్ర జేయటం చూసి హసన్ తెరచాప స్తంభం పైకి త్రాటి నిచ్చెన మీదుగా ఎగబ్రాకాడు. తీరా పైకి పోయాక గాలి ఉధృతానికి పడవ అటు ప్రక్కకూ, ఇటుప్రక్కకూ ఊగిసలాడిపోయింది. హసన్ బల్లిలా తెరచాప స్తంభానికి కరుచుకుపోయాడు.

"ఒరేయ్ కుక్కా! త్వరగా తాళ్ళు సరిచెయ్! గాలికి అవి తెగిపోతాయో, నీ పీక కూడా తెగగోస్తాను!" లార్సన్ అరిచాడు.

హసన్‌లో చలనం కలిగింది. అతడు త్రాళ్ళను గట్టిగా కట్టాడు. తెగేలా వున్న త్రాళ్ళకు కొత్త తాడు జోడించి కట్టాడు.

"ఇక దిగిరా!" లార్సన్ అనుమతి ఇచ్చాడు.

8

ఈ నౌక మీదకు వచ్చాక వారాలూ, తేదీలు గూడ మరచిపోయాడు నారాయణరావు.

అతడు తీరిక క్షణాల్లో కెప్టెన్ లార్సన్ మనస్తత్వం గురించే ఆలోచించేవాడు. ఒక్కొక్కప్పుడు లార్సన్ తత్వవేత్తలా కనుపిస్తాడు. మరోసారి హృదయం లేని పాషాణంగా తోస్తాడు.

అతడి ప్రవర్తన చాలా విచిత్రంగా వుంటుంది. ఏవేళ ప్పుడు యెలా వుంటాడో యెవరూ వూహించలేరు.

అయితే అతడిపట్ల ఈ నౌకలోని వారందరికీ పూర్తి ద్వేషం వుంది. అదను చిక్కితే లార్సన్‌ని దారుణంగా చంపి స్వేచ్ఛను పొందాలన్న కోర్కె ప్రతి ఒక్కరికీ

ఉంది. కానీ కెప్టెన్ లార్సన్ కసాయితనానికి ఝడిసి అతడికి లొంగి ఉన్నారందరూ.

ఆరోజు మరో విచిత్రం జరిగింది. కెప్టెన్ లార్సన్ థామస్‌ని పేకాటకు పిలిచాడు. నారాయణరావుని కూడా పిలిచి ఆట గమనిస్తూండమని చెప్పాడు.

ప్రతి ఆటలోనూ లార్సన్ గెలిచాడు. థామస్ తన గదికి వెళ్ళి కొద్దికొద్దిగా డబ్బు తెచ్చి ఆటలో పెట్టేవాడు. ఓడిపోగానే తిరిగి మళ్ళీ కొంత తెచ్చేవాడు.

కెప్టెన్ లార్సన్, పాత వంటవాడూ, ప్రస్తుతం నావికుడూ అయిన థామస్ దాచుకున్నదంతా గెల్చుకున్నాడు. దాన్ని లెక్కవేస్తే సరిగా అయిదువందల రూపాయలయింది.

“ఆ డబ్బు నాదే!” అన్నాడు నారాయణరావు సంతోషంతో.

“అని దాని మీద రాసి వుందా? ఈ లోకంలో బలం గలవాడిదే అన్నీను. అసలా ప్రకృతి సృష్టిలోనే ఉంది. బలమైన ప్రాణులు బలహీనమైన వాటిని విందుచేసుకుంటాయ్. లేడిని పులి, ఏనుగుని సింహం, కప్పను పాము, ఎలుకని పిల్లి ఇలాగే! కానీ మానవుడు తానేదో తెలివైనవాడిననే గర్వంతో బలహీన వర్గాలకు సాయం చెయ్యాలనే మిషతో చట్టాల్ని యేర్పరిచాడు. అంతమాత్రంచేత పేదవాడి బాధలు తీరిపోతాయా? లేదు! బలవంతుడు చట్టాని కందకుండా పనిచేస్తూ సన్నకారువాడ్ని పీడిస్తూనే వున్నాడు!”

“అంటే ప్రపంచంలో నీతీ, నిజాయితీ, ధర్మం, న్యాయం ఇదంతా బూటకమేనా?”

“ముందు మనిషి తన సంక్షేమాన్ని చూసుకుంటాడు. తర్వాత తనమీద ఆధారపడిన భార్యా పిల్లల సంక్షేమం

కోసం పాటుపడతాడు. ఆ తర్వాత నే మనిషి సంఘానికి ఉపయోగపడే పనులు చేయాలని సాంఘిక సంస్కర్తల ఉవాచగదా?"

"అంటే నీ స్వార్థాన్నే నీవు చూసుకుంటున్నావన్న మాట!"

లార్సన్ నవ్వాడు. "ఆ! ఇప్పుడు నీవు నా దారికి వస్తున్నావ్?"

"కానీ మీ స్వార్థం కోసం, మీ స్వలాభం కోసం, మీ ఆత్మ సంతృప్తికోసం ఇంత మందిని ఇంత దారుణంగా హింసించటం అన్యాయం కాదూ?"

"నీవు చెప్పినదానికి ఒప్పుకుంటాను. నేనింత కర్కశంగా ఉండకుండా, సౌమ్యంగా ఉంటానే అనుకో! అప్పుడు వీళ్ళు నన్ను అసలు బ్రతకనిస్తారంటావా? నన్ను చంపి, నా కండల్ని కాకులకూ గద్దలకూ వేయరూ?"

"ఇప్పుడు మాత్రం తక్కువేముంది. పగబట్టిన నాగుల్లా, ఎప్పుడు అదను దొరుకుతుందా, ఎప్పుడు కాటు వేద్దామా అని ఎంతమంది కాచుక్కూర్చోలేదు?"

"అందులోనే నా కానందం వుంది. అవకాశం వస్తే నా ప్రాణాలు తీయటానికి వెనుకాడని శత్రువులతో నేను ఎప్పుడూ అప్రమత్తతో, అజాగ్రత్తతో మెలగటానికి ఆస్కారం ఉంటుంది."

"మీరేమన్నా చెప్పండి. మీ హింసాత్మక ధోరణి మాత్రం నాకు నచ్చలేదు." నారాయణరావు నిష్కర్షగా చెప్పేశాడు. తీరా అనేశాక తన మాటకు లార్సన్ కోప గించుకుంటాడేమోనని భయపడ్డాడు.

కెప్టెన్ లార్సన్ పకపక నవ్వాడు. "నేను హింసా

త్మక ధోరణి గలవాడ్ని అనుకుంటే, నా సోదరుడ్ని చూస్తే నీవేమంటావో నా కర్థం కావడంలేదు. వాడికి నాపాటి అక్షరజ్ఞానం గూడ లేదు. మనిషిని నిలువునా చర్మం వలిపిస్తాడు వాడు!''

''మీ సోదరుడా? ఆయనేం పని చేస్తుంటాడు?''

''నాలాగే వాడికీ మరో ఓడ వుంది. అయితే అది స్టీమ్‌తో నడిచేది. వాడూ 'సీల్స్'ని వేటాడ్తాడు. మా ఇద్దరికీ బద్ధ విరోధం! మాలో ఒకరివల్ల మరొకరికి చావు రాసి ఉన్నదనేది మాత్రం యథార్థం!''

నారాయణరావు మౌనంగా వుండిపోయాడు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, లార్సనే మళ్ళీ ''ఇన్నాళ్ళకు నా మనసు విప్పి మాట్లాడితే అర్థం చేసుకోగలిగిన వ్యక్తి దొరికాడు'' అన్నాడు.

ఆ విధంగా కెప్టెన్ లార్సన్ మెప్పు పొందగలిగినందుకు నారాయణరావు తనను తాను అభినందించుకున్నాడు.

నారాయణరావు ఇక వంటశాలకు పోవలసిన అగత్యం తప్పింది. ఆ బాధ్యత మరొకరికి అప్పజెప్పబడింది.

మరునాడు భోజనాల సమయంలో లార్సన్ వచ్చి బంగాళాదుంపను తెప్పించాడు. దాన్ని తన పిడికిలిలో పెట్టి వత్తేశాడు. బంగాళాదుంప పొడిపొడి అయిపోయింది. లార్సన్ గర్వంగా నవ్వాడు.

మరుక్షణంలోనే అతడు నారాయణరావు చేతిని పట్టుకున్నాడు గట్టిగా. అలానే గట్టిగా వత్తేశాడు. నారాయణరావు ఖూనీ జరుగుతున్నట్టుగా రంకెలు పెట్టాడు. చేతి ఎముక ఫ్రాక్చర్ అయిందా అన్నంత బాధ కలిగింది.

"నా బలాన్నంతా ఉపయోగించలేదు. ఏదో సాంపిలుగా వత్తాను. అంతమాత్రానికే ఇలా అయిపోతే ఎలా?" అన్నాడు నవ్వుతూ పైగా.

9

నారాయణరావు కెప్టెన్ ప్రాపకాన్ని సంపాదించడం థామస్‌కి కంటగింపు అయింది. అందుకని అతడో పథకం వేసి, వంటవాడ్ని మరో పనికి పారద్రోలాడు. దాంతో నారాయణరావు తిరిగీ నలభీమపాకానికి దిగాల్సి వచ్చింది.

ఒకరోజు థామస్ భోజనం చేస్తూ పదార్థాలు యేవీ బాగోలేవని పిడికిలి బిగించి నారాయణరావు మీదకు వచ్చాడు.

అయితే నారాయణరావు ఇదివరకులా భయపడి పారిపోలేదు. ఇక్కడి దౌర్జన్యానికీ, హింసాకాండకూ అతడు అలవాటుపడిపోయాడు.

తిరిగి తనుగూడ పిడికిళ్ళు బిగించి థామస్‌ని ఎదుర్కోవటానికి సంసిద్ధుడైనాడు. ఈ హఠాత్పరిణామానికి థామస్ వెనక్కి తగ్గాడు తనలో తనే విస్మయం చెందుతూ.

థామస్ అంతతో ఊరుకోలేదు. నారాయణరావుని భయపెట్టేందుకు మరో పన్నాగం పన్నాడు. వంటగది షెల్ఫ్‌లోంచి, మాంసం కోసే రెండడుగుల కత్తిని తీసుకున్నాడు. అందరూ చూస్తూండంగానే, బాహాటంగా, దాన్ని నూరసాగాడు. పదును బెట్టడం మొదలెట్టాడు.

నావికులూ, వేటగాళ్ళూ వింతగా థామస్ చుట్టూ మూగేరు. "రండర్రా! థామస్ కత్తి నూరుతున్నాడు నారాయణరావుని పొడవటానికి!" అని ఒకళ్ళనొకళ్ళు పిలుచుకుని మరీ వస్తున్నారు.

థామస్ ఇదంతా వేడుక కోసం చేయటం లేదనీ, అవసరం వచ్చినప్పుడూ, అవకాశం కలిగినప్పుడూ దాన్ని తప్పకుండా తనమీద ఉపయోగిస్తాడనీ నారాయణరావుకి తెలుసు.

అందరూ తనను వింతగా గమనించడం థామస్‌కి కొంత గర్వకారణం అయింది.

మరో నావికుడు హసన్, థామస్ వంక చూసి హేళన చేశాడు. "నీవు ఒట్టి దొంగవిరా!" అని అతడిన్ని పరిహసించినపుడు, థామస్ అతడి వంక కత్తిని ఝుళిపించి బెదిరించాడు.

హసన్ ఇంకా హేళన చేశాడు. మెరుపులా థామస్ దూకాడు హసన్ మీదకు. హసన్ మోచేతి క్రింది నుంచి మణికట్టు వరకూ వున్న కండ తెగి క్రింద బడింది. అతడి చేతినుండి కారిన రక్తాన్ని చూసి, ఆవేశంలో కత్తితో పొడిచిన థామస్సే అదిరిపోయాడు. హసన్ మాత్రం చెక్కు చెదరలేదు.

"ఒరేయ్ థామస్! నీ పాపం పండే రోజు త్వరలోనే వస్తుందిరా! ఆ రోజున నీ మీద ఇంతకింతా పగ సాధించి తీరతాను!" అన్నాడు హసన్, అక్కడ్నుంచి వెళ్ళిపోతూ.

హసన్ మాటలకు థామస్ కొద్దిగా ఝుడిసిన మాట వాస్తవమే! కానీ తన చర్యవల్ల నారాయణరావు ఇంకా భయపడ్డాడని తెలిసి ఇంకా సంబరపడ్డాడు.

నారాయణరావు తనంటే భయపడుతున్నాడని తెలిసిన, థామస్ తనకు తీరిక వున్నప్పుడల్లా కత్తిని బయటకు తీసి నూరసాగాడు. తనకు నౌకలో అదే ఉద్యోగమా అన్నట్లుగా కత్తి పదును పెట్టసాగాడు.

అటు కెప్టెన్ లార్సన్ గానీ, మరో ఇతర వ్యక్తి ఎవరూ తనకు సాయం చెయ్యరు; థామస్ నుంచి రక్షించే ప్రయత్నం చేయరు, సరిగదా తన పిరికితనానికి నవ్వుతారు. థామస్ తనను కత్తితో పొడిస్తే, తను గాయపడితే, ఓడలోని వారంతా వినోదిస్తారు.

దౌర్జన్యాన్ని, దౌర్జన్యంతోనే యెదుర్కోవాలి. హింసకు హింసే బదులు చెప్పగలదు. అందుకనే నారాయణరావు కిచెన్‌లో శోధించి మరో కత్తిని దొరకబుచ్చుకున్నాడు. ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయాడు నారాయణరావు.

మర్నాడు మధ్యాహ్నం థామస్ అలవాటు ప్రకారం కత్తి తీసి నూరుతున్నాడు.

నారాయణరావు గూడ తను దొరకబుచ్చుకున్న పాత కత్తిని బయటకు తీశాడు. థామస్‌కి యెదురుగా కొంత దూరంలో కూర్చుని తను గూడ కత్తిని పదును పెట్టసాగాడు.

ఇద్దరు వ్యక్తులు కత్తులు నూరుతుంటే డెక్ మీదకు సగం మంది జనం పోగయ్యారు, వాళ్ళిద్దరూ యుద్ధం చేస్తే చూడాలని కుతూహలంతో చూడసాగారు.

అలా అరగంట గడిచింది. ఈ మధ్యలో బోర్ కొట్టిన నావికులు తమ పనిలోకి వెళ్ళిపోయారు.

థామస్ తను కూర్చున్న చోటునుంచి లేచి, నారాయణరావు దగ్గరకు వచ్చాడు. 'వీళ్ళ ఆనందం కోసం మనం కొట్టుకు చావడం అవివేకం. వాళ్ళకు మనపై ఏ మాత్రం అభిమానం లేదు. మనం ఒకళ్ళ కుత్తుకలు మరొకరం కత్తిరించుకుంటే వీళ్ళు వినోదిస్తారు. నీవు మంచివాడి

వని నాకు తెలుసు! నీలోనూ ధైర్యం ఉందని గ్రహించాను. మనం మిత్రులుగానే ఉండిపోదాం!''

నారాయణరావు అతడిలోని మార్పుకు సంతోషించాడు. ఇద్దరూ చేతులు చాచి కరచాలనం చేసుకున్నారు.

''ఇంకేం చూస్తారు? ఫొండి, ఫొండి!'' అని అరిచాడు థామస్ అక్కడ మిగిలి ఉన్న వాళ్ళతో.

''థామస్ పొగరు తగ్గిందిలే! రాబ్ దే ఇకనుంచి పై చెయ్యి!'' జనంలో కొందరు చెప్పుకుంటూ వెళ్ళిపోయారు.

నారాయణరావు తన కింత సులభంగా గెలుపు లభిస్తుందని కలలో గూడ ఊహించలేదు.

అంతేకాదు! ఈ గెలుపుని పూర్తిగా సద్వినియోగం చేసుకోదలిచాడు గూడా. పైగా కెప్టెన్ లార్సన్ అప్పుడప్పుడూ నారాయణరావుని ప్రత్యేకించి పిలిపించేవాడు పిచ్చాపాటీ మాట్లాడేందుకు. ఆ సమయంలో నారాయణరావు చెయ్యాల్సిన పనిని గూడ థామసే చేసేవాడు కిక్కురుమనకుండా!

10

''సీ డెవిల్'' నౌక ఇంకా ఉత్తరంగా ప్రయాణం సాగించింది. సముద్రంలోంచి చేపలు పైకి యెగిరి పడుతుంటాయి! రాత్రిపూట అయితే ఇంకా చెప్పనక్కర్లేదు. తెల్లారేసరికి బోలెడు చేపలు డెక్ నిండా పడి ఉంటయ్. థామస్ వాటన్నిటినీ ఏరుకెళ్ళి కూరవండేవాడు.

''మన నౌక జపాన్ తీరప్రాంతాలకు వెళ్ళేసరికి ఉంటుంది పని! అక్కడే కెప్టెన్ లార్సన్ సోదరుడు కెప్టెన్ జాక్ ఎదురుపడతాడు. అతడి నౌక పేరు 'సీ

హాక్.' వాడి నౌక ఆధునికమైన ఓడ. మనదానిలాగ తెర చాపలతో కాకుండా, స్టీమ్ మీద నడుస్తుంది. పైగా దాని మీద ఫిరంగులు గూడ బిగించి ఉన్నాయట. దాని కెప్టెన్ చేపలవేట మిషతో సముద్రాల మీద తిరుగుతూ, ఇతర వ్యాపార నౌకల్ని దోచేస్తుంటాడట. చేతికి దొరికిన మనుష్యుల్ని బంధించి తీసుకువెళ్ళి, బానిస వ్యాపారం చేస్తాడట గూడాను." భోజనాల సమయంలో థామస్ చెప్పాడు నారాయణరావుకి.

థామస్ స్నేహంగానే ఉంటున్నా, అతడంటే మనసులో భయం పోలేదు నారాయణరావుకి. ఏ వేళప్పుడు రహస్యంగా వెన్నుపోటు పొడుస్తాడో అని శంకిస్తూనే, తగు జాగ్రత్తలో ఉన్నాడు.

అయితే థామస్ దగ్గర మరో దుర్గుణం ఉందని గ్రహించాడు నారాయణరావు. అదే చాడీలు చెప్పే పాడు అలవాటు. కెప్టెన్ ప్రాపకం సంపాదించాలని అతడు మిగతా వారిపై పితూరీలు చెప్పేవాడు.

సామాన్యంగా భోజనాల దగ్గరే నావికులకూ, వేటగాళ్ళకూ మాట్లాడుకునే తీరిక దొరుకుతుంది. కెప్టెన్ లార్సన్ లేకపోతే మరీ వీలు, కెప్టెన్ దురంతాల్ని గురించి, అతడి సోదరుడు తారసపడితే ఎలా యుద్ధం రేగేదీ చెప్పుకునేవారు ఒక్కోసారి. అందులో ప్రత్యేకించి చెప్పేవాడు జాన్సన్ అనే నావికుడు.

థామస్ తన కేమీ పట్టనట్టుగా, ముభావంగానే ఉంటూ, చెవులు రిక్కించి వినేవాడు. ఆ మధ్యాహ్నానికి ఆ వార్తల్ని కెప్టెన్ లార్సన్‌కి జేరవేసేవాడు.

ఆ రోజు నారాయణరావు, కెప్టెన్ లార్సన్ గదిలో కూర్చుని ఏవో మాట్లాడుతున్నాడు.

మాట్లాడుతూన్నవాడల్లా అకస్మాత్తుగా ఆగిపోయాడు కెప్టెన్. అక్కడ కాపలా కాసే నావికుడ్ని పిలిచి జాన్సన్‌ని పిల్చుకురమ్మన్నాడు.

కొద్ది నిముషాల్లో నావికుడు జాన్సన్ వచ్చాడు అక్కడకు.

వాడ్ని చూస్తూనే కెప్టెన్ లార్సన్ విసురుగా కుర్చీలోంచి లేచాడు. "ఏరా పంది వెధవా? నాకు ద్రోహం తలపెట్టి నా అన్నతో చేతులు కలపాలని పథకం వేస్తున్నావురా?"

అతడి మాటలకు జాన్సన్ భయపడలేదు. "మేం చేస్తున్న చాకిరీకి నీకు మా మీద అభిమానం గూడ లేదు. పైగా మమ్మల్ని అతి దారుణంగా ట్రీట్ చేస్తున్నావ్! ఒక రకంగా మీ సోదరుడే నయం ఆ లెక్కన! బాగా కష్టించి పని చేసే వాళ్ళని పెంపుడు జంతువుల్లా చూసుకుంటాడు."

"నీలాంటి వెధవ వాగుడు వాగే వాళ్ళను నేను ఏం చేస్తానో తెలుసా?" అంటూ జాన్సన్ ఛాతీపై పిడికిలి బిగించి గుద్దాడు కెప్టెన్ లార్సన్.

జాన్సన్ తనను తాను రక్షించుకునేందుకు పెనుగులాడాడు. ఎదురుతిరిగి పోరాడాడు. కానీ అతడు కెప్టెన్‌కి సరిజోడీ కాడు ఎందులోనూ. అందువల్ల కెప్టెన్ లార్సన్‌దే పైచేయి అయింది.

ఈ హింసాకాండను చూడలేక నారాయణరావు ఆ గదిలోంచి బయటకు వెళ్ళబోయాడు. అతడ్ని కెప్టెన్ ఆటంకపరిచాడు.

"నీవు వెళ్ళటానికి వీల్లేదు. అక్కడే కూర్చుని ఏం

జరుగుతుందో కనిపెట్టు!" అని వెనక్కి త్రోశాడు కుర్చీ లోకి.

నేలమీద పడిపోయిన జాన్సన్ ని తిరిగి లేవనెత్తి, మళ్ళీ కొట్టాడు కెప్టెన్. జాన్సన్ నోటంట నెత్తురు కక్కాడు. లేవదీసి నిలబెట్టినా, నిల్చునే స్థితిలో లేడు జాన్సన్! తోటకూర కాడలా వాలిపోతున్నాడు.

అతడ్ని నేలమీదనే వుంచి, అతడి డొక్కల్లోనూ, శరీరం మీదా బూటుకాలితో అందిన చోటల్లా తన్నాడు కెప్టెన్! మృత్యువుకి అతి 'చేరువులోకి నెట్టాక, అప్పుడు వదిలేశాడు జాన్సన్ ని కెప్టెన్.

అతడ్ని మోసుకెళ్ళి డెక్ మీద పారేయటానికి హసన్ ని పిలిచాడు కెప్టెన్.

హసన్ జాన్సన్ వంక చూస్తూనే కెప్టెన్ లార్సన్ మీదకు తిరుక్కున్నాడు. "నీవు మనిషివి కాదు! రాక్షసుడివి! నిండు ప్రాణాల్ని ఎన్నింటిని బలి తీసుకుంటే నీకు సంతృప్తి కలుగుతుంది?"

కెప్టెన్ లార్సన్ అతడ్నేం చేయలేదు. పైగా వికటంగా నవ్వాడు.

"ఒరేయ్! మాటల ప్రతాపం కాదురా! చేతనైతే కత్తి తీసుకో! రా నాతో తలపడు!"

"ఛీ! నీలాంటి వాడితో తలపడి, నా ప్రాణాల్నీ పరువునీ పోగొట్టుకోవడం ఇష్టంలేదు!"

అప్పుడే లోపలకు వచ్చిన థామస్ హసన్ ని చూసి ఏదో అన్నాడు. "అమ్మో! కెప్టెన్ మీదకే తిరగబడ్తున్నారా? ఎంత ధైర్యం?" అని కెప్టెన్ కి వత్తాసు పలికాడు. హసన్ పై కెప్టెన్ కి కోపం తెప్పించాలని థామస్ పథకం.

కెప్టెన్ పై కోపంగా ఉన్న హసన్ తన ద్వేషాన్ని థామస్ పైకి మరలించాడు. పిడికిళ్ళు బిగించి థామస్ పై గుద్దుల వర్షం కురిపించాడు.

థామస్ బొడ్లో దాచుకున్న కత్తిని బయటకు లాగాడు. దాన్ని అతడు ఉపయోగించే లోపలే, హసన్ అతడి చేతిని మెలిత్రిప్పాడు. థామస్ చేతిలోని కత్తి క్రింద పడిపోయింది.

"కూరలు తరిగే కత్తితో మనుష్యుల్ని చంపటానికి యత్నించటం నీ తెలివితక్కువదనానికి నిదర్శనం రా!" అంటూ థామస్ని కొట్టసాగాడు.

"అయ్యో, బాబో! చంపేస్తున్నాడు! రక్షించండి!" అంటూ కేకలు పెట్టాడు థామస్ నేల వాలిపోయి.

కానీ అతడాశించినట్టుగా కెప్టెన్ లార్సన్ అతడికి సాయం చేయలేదు. పైపెచ్చు అక్కడేదో కొత్త వినోదం జరుగుతున్నట్టుగా ఆనందించసాగాడు.

మరికొందరు నావికులూ చేరారు అక్కడకు. ఎవరూ థామస్కి ఆసరా ఇవ్వలేదు.

కెప్టెన్ లార్సన్ చేతిలో జాన్సన్ చావుదెబ్బలు తిన్నట్టుగానే, థామస్ గూడ హసన్ చేతిలో దెబ్బలు తిని స్పృహ కోల్పోయాడు.

"ఆ రోజు నన్ను కత్తితో పొడిచినందుకు ఇది తగిన శాస్తి!" అంటూ హసన్ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. థామస్ కొనప్రాణంతో మిగిలాడు.

ఆ నౌకలో జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే, మానవుడు అరణ్యంలోని క్రూరమృగానికన్న దారుణంగా మారిపోతున్నాడేమో అనిపించింది రావ్కి.

అసలు వీళ్ళల్లో ఇంతటి హింసా ప్రవృత్తి ఎలా ఏర్పడిందా అని ఒక్కోసారి ఆలోచించేవాడు నారాయణ రావు.

వీళ్ళు తల్లిదండ్రులకూ, భార్యాబిడ్డలకూ సుదూరంగా మెలగటమే వాళ్ళలో ఆప్యాయత, ఆదరణ కరువు అవటానికి ఒకరకంగా కారణమేమో!

11

రాత్రి బాగా ప్రొద్దుపోయింది. నారాయణరావు డెక్ మీద రెయిల్స్‌కి ఆనుకుని ఏదో ఆలోచిస్తున్నాడు.

అంతలో నీళ్ళలో ఏదో ఆకారం కదలటాన్ని గమనించాడు అతడు, కానీ చీకటిలో అదేమిటో స్పష్టంగా కనుపించలేదు. ఎవరో నౌక ప్రక్కగా నీళ్ళలో ఈదుతున్న సవ్వడి మాత్రమే వస్తోంది. బహుశా ఎవరైనా ప్రమాదవశాత్తు నౌకలోంచి నీళ్ళలోకి పడిపోయారేమో అనుకుంటూ, శబ్దం వస్తున్న వేపుకు తాడు విసిరేశాడు నారాయణరావు.

కొద్ది క్షణాల్లోనే ఆ వ్యక్తి త్రాడు పట్టుకుని నౌక మీదకు అతి సాహసోపేతంగా ఎగబ్రాకాడు. తనచేతితో రెయిల్స్‌ని గట్టిగా పట్టుకున్నాడు. ఒక్క దూకుతో రెయిల్స్ కివతలకు దూకాడు. అతడి తలనుంచి పాదాల వరకూ నీళ్ళు కారుతున్నయ్. అతడెవరో కాదు! కెప్టెన్ లార్సన్.

"ఏం జరిగింది సార్?" నారాయణరావు ఆశ్చర్యంగా చూశాడు.

"ఏడీ? ఆ వెధవెక్కడ? జాన్సన్ ఎక్కడ?" రంకెలు పెడుతూ, చిందులు త్రొక్కుతూ కెప్టెన్ లార్సన్ నౌక అంతా కలయ వెదికాడు.

డెక్ మీద ముసుగుదన్ని నిద్రపోతున్న వాళ్ళ ముసుగులు లాగి మరీ చూశాడు కెప్టెన్. తర్వాత మెట్లు దిగి నౌక లోపలిభాగానికి వెళ్ళాడు. వంటశాలా, ప్రతి గదీ శోధించి చూశాడు.

జాన్సన్ అయిపు లేడు. కళాసీలు పడుకునే చోటికి వెళ్ళాడు కెప్టెన్ లార్సన్. అక్కడ ఎనిమిది కళాసీల పడకలున్నయ్. నాలుగు ఒక వరసలో, మరి నాలుగు మరో వరసలో, రెల్లో స్లీపర్ బెర్త్‌లలా వున్నాయి.

కెప్టెన్ ప్రతివాడి దగ్గరకూ వెళ్ళి, వాడు నిజంగా నిద్రపోతున్నదీ లేక దొంగనిద్ర పోతున్నట్టుగా నటిస్తున్నాడా అని తరచి తరచి చూశాడు.

ఒకవేపు రెండు బెడ్‌లు ఖాళీగా వున్నయ్. పై రెంటిలో ఒకదాంట్లో హసన్ పడుకుని వున్నాడు.

కెప్టెన్ అతడి దగ్గరకు వెళ్ళంగానే, హసన్ పులిలా అరుస్తూ లార్సన్ మీదకు దూకాడు.

అక్కడంతా చీకటిమయం. హసన్ హఠాత్తుగా మీద పడడంతో, కెప్టెన్ లార్సన్ చేతిలోని టార్చిలైట్ క్రింద పడిపోయి, పడకల క్రిందకు దొర్లిపోయింది.

కెప్టెన్‌ని అనుసరిస్తున్న నారాయణరావుకి తను కలుగ జేసుకోవాలా వద్దా, లార్సన్‌కి సాయం చేయాలా, లేక వాడి ఖర్మకు వాడ్ని వదిలేసి ఊరుకుందామా అని సందేహించాడు.

ఈ లోపలే మరో వ్యక్తి గూడ వచ్చి హసన్‌ని కలిశాడు. అతడే జాన్సన్ అని పసిగట్టాడు నారాయణరావు.

నిరాయుధులైన వ్యక్తులు ఒకరితో ఒకరు కసిగా, కత్తులతో ఒకరినొకరు చావగొట్టుకోవడం చూస్తుంటేనే, నారాయణరావుకు కడుపులో దేవినట్టయింది.

"ఎవరైనా కత్తి అందుకోండి!" హాసన్ చీకట్లోనే జీరబోయిన కంఠంతో అరిచాడు.

"కత్తి లేకపోతే నేంరా ఫూల్! వాడి తలకాయని రాక్ కేసి చితక్కొట్టు, మెదడు బయటకు వెళ్ళుకొచ్చేలా!" జాన్సన్ అరిచాడు.

చీకటిలో, నిశ్శబ్దంగా కెప్టెన్ లార్సన్ అతి లాఘవంగా ఇద్దరు శత్రువులతో పోరాడుతున్నాడు.

ఈ గలాటాకు మరికొందరు నిద్రలేచారు. వారూ హాసన్, జాన్సన్ల పక్షం వహించి, లార్సన్ పని పడుతున్నారు.

లార్సన్ ఒక్కడు. వాళ్ళు ఆరుగురు పోగయారు. ఆలస్యమయితే తన ప్రాణాలు దక్కవనుకున్నాడు గాబోలు, శత్రువుల్ని ఎలాగో చీల్చుకుని పరుగుదీసాడు లార్సన్.

ఆరుగురు కలసినా అతడ్ని నిరోధించలేకపోయారు.

ఏదో అప్రమత్తతగా ఉండగా, జాన్సన్ అతడ్ని సముద్రంలోకి నెట్టేశాడట, ఎవరూ చూడకుండా.

నీళ్ళలో పడిపోయి, ఈదుతూ, ముందుకుపోతున్న నౌకను చేరుకో గలిగాడు లార్సన్ నాలుగు గంటలు గడిచాక. అటువంటి అలసిన వ్యక్తికి ఆరుగురితో తలపడే శక్తి ఉండటం సాధ్యంకాదు.

మెట్లెక్కుతున్న కెప్టెన్ కాళ్ళు పుచ్చుకుని లాగుతున్నారు. కెప్టెన్ లార్సన్ ఒక్కొక్క తాపుతో ఒకడ్ని వదిలించుకుని ఒక్కో మెట్టు ఎక్కుతున్నాడు.

పై మెట్టు మీద కెక్కేసరికి డెక్ మీద 'పీర్' దగ్గరున్న నావికుడు పరుగెత్తుకుంటూ వచ్చి కెప్టెన్‌కి చేయూతనిచ్చి, పైకి లాగేశాడు.

కెప్టెన్ తో తలపడిన వారంతా కారిడర్ లో, చీకట్లో ఉండిపోయారు.

12

చీకట్లో మిగిలిపోయిన వారు, వారిలో వారు తిట్టుకో సాగారు.

“మనం ఇంతమందిమి ఉండగా, వాడు ప్రాణాలతో ఎట్లా తప్పించుకు పోగలిగాడు?” హాసన్ బుసలు కొడుతున్నాడు. అతని ఒంటి మీది దుస్తులు చిరిగిపోయాయి. అతడి శరీరం మీద తగిలిన గాయాల్నుంచి రక్తం కారుతోంది.

జాన్సన్ పరిస్థితీ అలాగే వుంది. మరో కళాసీ చెయ్యి, మోచేతి వరకూ విరిగిపోయింది.

“వాడు మనిషయితే గదా? రాక్షసుడు కాబట్టే ఇందర్ని తప్పించుకుని పోయాడు! పైగా మనలో యెవరి దగ్గరా సమయానికి కత్తిగూడా లేకపోయే! లేకపోతే ఉల్లిపాయని తరిగినట్టుగా, వాడి కంఠాన్ని తెగ్గోసి ఉండేవాళ్ళం.”

“ఇంతకీ వాడు మనల్ని గుర్తించి ఉంటాడా?” మరెవరో తన భయాన్ని వ్యక్తం చేశారు.

“చీకట్లో యెలా గుర్తుపట్టగలడు? మనలో యెవరన్నా వాడి పక్షం అయి చెబితే తప్ప!”

“మన ఒంటిమీది గాయాలే మనల్ని ఇట్టే పట్టిస్తయ్!”

“కాకపోతే, ఆ కెప్టెన్ గాడి మీదకు తలపడినట్టు, మన మీదకు గూడా యెవరో తలపడ్డారని చెబుదాం!” మరో వ్యక్తి నవ్వుతూ బదులిచ్చాడు.

“చాల్లేరా పిరికి వెధవల్లారా! మీ శూరత్వం మాటల్లో గాక చేతల్లో ఏ మాత్రం చూపించినా, వాడీపాటికి

యమపురికి వెళ్ళి ఉండేవాడు! ఇప్పుడు తిప్పలెవరికీ? వాడు మిమ్మల్నేం అనడు. దీని కంతటికీ కారకులు హసన్, జాన్సన్ అని వాడెప్పుడో గ్రహించి వుంటాడు. మీ తెలివి తక్కువ తనం మా ఇద్దరి ప్రాణాల మీదకూ తెచ్చి పెట్టింది'' జాన్సన్ విసుగ్గా అన్నాడు.

ఎవరో కారిడర్ లోని ఆరిపోయిన దీపాన్ని వెలిగించారు.

ఆ వెలుతురులో వారగా నిలబడి వాళ్ళ మాటల్ని వింటున్న నారాయణరావు అందరి దృష్టిలో పడ్డాడు.

పైగా అదే సమయంలో డెక్ మెట్లమీద నుంచి కళాసీ ఒకడు అరిచాడు నారాయణరావుని కెప్టెన్ లార్సన్ పిలుస్తున్నట్టుగా.

కారిడర్ లోని వ్యక్తులందరూ భయం భయంగా నారాయణరావు వంక చూశారు.

''ఇదో వస్తున్నా!'' అని అరిచి, అడుగు ముందుకు వేశాడు నారాయణరావు.

''ఆగు! ఎక్కడకు వెళ్ళేది నీవు? నీ నోరు శాశ్వతంగా మూయించేస్తాను!'' అంటూ అక్కడున్న వారిలో ఓ కళాసీ అతడి పీక చుట్టూ చేయి వేసి అదుమసాగాడు.

నారాయణరావు పై ప్రాణాలు పైనే పోయాయి. కెప్టెన్ లార్సన్ బలిష్ఠుడూ, మొండి ధైర్యం గలవాడు గనుక ఇంతమందినీ నిలద్రొక్కుకుని పారిపోగలిగాడు. మరి తనో? ఇక్కడున్న ఆరుగురిలో ఏ ఒక్కరినీ తను ఎదుర్కోలేడు.

''ఆగు! అతన్నేం చేయకు! అతనేం చెప్పాళ్ళే కెప్టెన్ తో! వదిలెయ్!'' హసన్ అరిచాడు.

"అవును! అదీ నిజమే! కెప్టెన్ అంటే మన కెంత ఇష్టమో, అతగాడికీ అంతే! అతడ్ని వదిలెయ్యి!" జాన్సన్ గూడ హాసన్‌ని బలపరిచాడు.

బ్రతుకుజీవుడా అనుకుంటూ నారాయణరావు అక్కడ్నుంచి పరుగెత్తుకెళ్ళాడు. కెప్టెన్ రూమ్‌లోకి వెళ్ళాడు.

కెప్టెన్ లార్సన్ చిన్ననిక్కరుతో అర్ధనగ్నంగా ఉన్నాడు. అతడ్ని బెడ్ మీద పడుకోబెట్టి, అతడి గాయాలకు మందువేసి కట్లుకడుతున్నాడు నౌక డాక్టర్.

"నీవు జాన్సన్ ప్లేస్‌ని తీసుకో మిస్టర్ రావ్! జాన్సన్‌కి బదులుగా 'వీల్' (నౌక స్టీరింగ్ లాంటిది) ని కంట్రోల్ చేసే భారం నీది!" అన్నాడు కెప్టెన్ లార్సన్, నారాయణరావు ముఖంలోకి చూస్తూ.

"ఆ పని నాకు సరిగా రాదుకదా?" నారాయణరావు నసిగాడు.

అయినా కెప్టెన్ వినిపించుకోలేదు.

'వీల్' దగ్గర అసిస్టెంట్‌గా చేస్తున్న కాళీచరణ్ సహాకారంతో త్వరలోనే పని నేర్చుకున్నాడు నారాయణరావు.

"త్వరలోనే నీవు మంచి పనివాడవవుతావ్ రావ్! ఆ తర్వాత నీవు ఏ నౌకలోకి వెళ్ళినా, నెత్తిన పెట్టుకుని పూజించుకుని మరీ నీకు పని ఇస్తారు. ఈ నౌకలోకి వచ్చే నాటికి నీకు ఎందుకూ కొరగాని లొల్లాయి పదాలు రాసుకోవడం మినహా మరేం చేతకాదు. నా శిష్యరికంలో నీవు నీ కాళ్ళమీద నిలబడగలిగే స్తోమతు సంపాదించుకోగలిగావ్! ఇక ఈ అనుభవాన్ని ఏనాటికీ మరిచిపోలేవు!" అని అభినందించాడు కెప్టెన్.

ఈ అనుభవం యెలా వున్నా, ఈ నౌకలో జరిగిన, దారుణాల్ని మాత్రం పది జన్మలకు గూడ మరిచిపోలేను అనుకున్నాడు నారాయణరావు మనసులో.

13

తనపై అత్యాచారం జరిగినప్పట్నుంచి, కెప్టెన్ లార్సన్ మరీ రాక్షసంగా ప్రవర్తించసాగాడు. నౌకలో పనిచేసే వారందరి పనీ నానాటికీ దుర్భరం కాసాగింది. లార్సన్ చేతిలో శిక్ష అనుభవించి గాయాలు తినేవారు రోజుకు ఇద్దరు ముగ్గురైనా తేలుతున్నారు. తన క్రింద పనిచేసే వాళ్ళ జీవితాల్ని ఎలా నరకప్రాయంగా చేయాలో కెప్టెన్ లార్సన్‌కి తెలుసు. అందుకై లక్షాతొంభయ్ ఉపాయాలు అతడికి వచ్చును.

హాసన్, జాన్సన్‌లు మాత్రం మళ్ళీ అవకాశం ఎప్పుడు వస్తుందా, ఎప్పుడు మళ్ళీ కెప్టెన్‌ని అంత మొందించుదామా అనే కాచుకుని ఉన్నారు.

ఒకసారి జాన్సన్ కత్తిని విసిరాడు కెప్టెన్ లార్సన్ మీదకు. వెంట్రుకవాసిలో అది గురితప్పి, వెళ్ళి తలుపుకు గుచ్చుకుంది.

కెప్టెన్ వికటంగా నవ్వాడు. తలుపుకు గుచ్చుకున్న కత్తిని లాగి బెల్ట్లో దోపుకున్నాడు.

జాన్సన్‌ని ఆ క్షణంలోనే చంపకుండా ఎందుకు వదిలేకాడా అని ఆశ్చర్యపోయాడు నారాయణరావు.

ఆ విషయాన్నే తర్వాత అడిగినప్పుడు, కెప్టెన్ లార్సన్ పెద్దగా నవ్వాడు. "ప్రమాదాలు ముంచుకురావడమంటే మంచినీళ్ళప్రాయం నాకు. జాన్సన్‌కి నన్ను చంపాలని ఉంది! వాడితో నేను చెల్గాటమాడుతున్నాను. కావా

లంటే నీవూ వాళ్ళతో కలు! నాకేం అభ్యంతరం లేదు!'' అని బదులు చెప్పాడు.

హసన్, జాన్సన్‌లతో అతడి మాటల్ని చెప్పాడు నారాయణరావు.

ఇద్దరూ పెదవి విరిచారు. ''నీ విందులో ఏమీ కలుగ జేసుకోకు రావ్! నోరు తెరవకుండా జరిగేది చూస్తుండు! ఎప్పుడైనా పనిబడితే ఏదైనా చిన్న సాయం చేద్దువులే!'' అన్నాడు జాన్సన్.

మర్నాడు నౌక ఏదో చిన్న ద్వీపం దగ్గర లంగరు వేసింది.

ఏదో మిషతో కెప్టెన్ లార్సన్, హసన్‌నీ, జాన్సన్నీ చితకబాదాడు.

''ఒరేయ్ జాన్సన్! నిన్ను కాల్చుకు తింటానురా! నా బాధలు భరించలేక సముద్రంలోకి దూకి ఆత్మహత్య చేసుకోకపోతే నా పేరు లార్సన్ కాదనుకో!'' అన్నాడు పైగా.

ఈ దెబ్బతో వాళ్ళిద్దరూ పారిపోతారనుకున్నాడు నారాయణరావు. కానీ వాళ్ళకా అవకాశాన్నివ్వ లేదు లార్సన్. నౌకలో మంచినీళ్ళు నింపుకోవడానికి ఆ ద్వీపంలో లంగ రేసింది ఆ నౌక. కెప్టెన్ లార్సన్ ద్వీపం మీదకు వెళ్ళి వచ్చాడు. తనతోబాటు హసన్‌నీ, జాన్సన్‌నీ గూడ వెంటబెట్టుకుని వెళ్ళి, మళ్ళీ సురక్షితంగా రావటం నారాయణరావుకే ఆశ్చర్యం వేసింది.

అయితే ఆనాడు కెప్టెన్ లార్సన్‌తో చీకట్లో తలపడిన కళాసీల్లో ఇద్దరు పారిపోవడానికి యత్నించారు. వేటాడే పడవనౌకదాన్ని వేసుకుని నౌకనుంచి విడిపోయారు వా రిద్దరూ.

నౌకలో ఉన్న వేటగాళ్ళు రైఫిల్స్ తీసుకుని కాల్పులు జరపడంతో, చివరకు వాళ్ళిద్దరూ తిరిగిరాక తప్పలేదు.

మంచినీళ్ళు నింపుకున్నాక నౌక తిరిగి తన పయనాన్ని మొదలుపెట్టింది దక్షిణాభిముఖంగా. ఇక ఇక్కడ్నుంచి సీల్ జంతువులు విరివిగా దొరుకుతాయనీ, మూడు నాలుగు నెలలపాటు వాటిని వేటాడడం జరుగుతుందనీ వివరించాడు కెప్టెన్.

జాన్సన్ ముఖం విచారంతో నిండిపోయింది. "ఆ దుర్మార్గుడు నన్ను త్వరగా చంపేస్తే బాగుండును, ఈ హింసకన్న!" అనుకున్నాడు పైకే.

అతడిపట్ల నారాయణరావుకి సానుభూతి ఎక్కువైంది. నిజంగానే సముద్రజలాలపై తేలియాడే ఈ దుర్భర నరకం కన్న చావే నయమేమో! జీవితానికి విలువ లేదు. ప్రాణాలంటే లక్ష్యం లేదు. అడుగడుగునా దారుణ శిక్షలు. ప్రతి చిన్న తప్పుకు అతి క్రూరంగా హింసాకాండ! అటువంటి జీవితం ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదేమో!

14

పగటిపూట నౌకకు కట్టి ఉన్న పడవల్ని నీళ్ళమీదకు దించేవారు. ప్రతి పడవలో తెడ్లువేసే కళాసీలు ఇద్దరు, ఒక నావికుడు, ఇద్దరూ వేటగాళ్ళూ వెడతారు, సీల్ జంతువుల్ని వేటాడేందుకు.

ఇంగ్లీషులో "సీల్" అంటే సముద్రపు కుక్క అని అర్థం. ఇవి ఒక్కొక్కటీ చిన్నసైజు ఏనుగు ప్రమాణంలో ఉంటవి. అటు అత్యుష్ణమూ, ఇటు అతి శీతలమూ కాని కర్కాటక, మకర రేఖా ప్రాంతాల్లో సముద్రాల్లో జీవనం చేస్తాయి. అవి గుంపులుగుంపులుగా మసలుతూ ఉంటయ్. మానవుల్ని చూస్తే వాటికి భయం లేదు.

అందుకే పడవల్లో మనుష్యులు దగ్గరకు వచ్చినా అవి బెదరి పారిపోవు.

అలాంటి సీల్ జంతువుల్ని పాడవాటి తెడ్డుతో బలంగా మోదేసరికి అది స్పృహతప్పి పోతుంది. గాలాలు వేసి దాన్ని పడవలోకి లాక్కుంటారు.

ముంచుకొస్తున్న ప్రమాదాన్ని గుర్తించి అవి పారిపోవటానికి యత్నిస్తే, రైఫిల్‌తో వాటిని కాల్చి చంపుతారు.

సీల్ జంతువు చర్మమూ, రక్తమూ, మాంసమూ వీటికి అనేక దేశాల మార్కెట్లలో మంచి గిరాకీ ఉంది.

వేటాడేందుకు "సీ డెవిల్" నౌకకు చెందిన పడవలు ఆరు ఉన్నయ్. అవి నౌకనుంచీ ఇరవయ్ మైళ్ళ విస్తీర్ణంలో వేటాడి, దొరికిన సీల్ జంతువుల్ని నౌకలోకి చేరుస్తయ్. తిరిగీ మళ్ళీ వేటకు వెడతయ్. సాయంత్రందాకా ఈ వేట సాగుతుంది.

దొరికిన సీల్ జంతువుల దేహాల్ని ఉప్పులో నానవేస్తారు చెడిపోకుండా.

వేట సాగేటప్పుడు నౌక డెక్ మీద కెప్టెన్ లార్సన్, థామస్, హసన్, నారాయణరావు మాత్రమే మిగిలిపోయేవారు. మిగతా సిబ్బంది అంతా వేటలో పాల్గొనేందుకు వెళ్ళేవారు.

ఆ రోజు యథాప్రకారం ఆరు పడవలూ వేటకు వెళ్ళినయ్. సముద్రం అంతా చాల ప్రశాంతంగా ఉంది.

డెక్ మీద రెయిల్స్ వెంట చుట్టి తిరుగుతున్న లార్సన్ రావ్‌ని పిలిచాడు.

"రావ్! నీవు యాక్టివ్‌గా ఉండాలి! త్వరలో తుఫాను రాబోతూన్నది. నౌక నిలిచిపోయేందుకు వీలుగా తెర చాపల్ని దించేశాం! గాలి వీచటం మొదలుకాకముందే

వాటిని విప్పాలి! లేకపోతే తుఫాను మొదలయాక వాటిని విప్పేందుకు యత్నిస్తే, గాలి ఉధృతానికి తెరచాపలు చిరిగిపోతాయి! తెరచాప స్తంభం త్రాళ్లు తెగిపోయే ప్రమాదం ఉంది!" అన్నాడు.

తుఫానుకు ముందు ప్రశాంతత నెలకొంటుందనే విషయాన్ని అనేక రచనల్లో చదివిన గుర్తేకానీ ప్రత్యక్షంగా చూసే అవకాశం రాలేదు లోగడ, నారాయణరావుకి.

"తుఫాను మొదలయితే, మన పడవలు ఆ ధాటికి తట్టుకుని నౌకను చేరుకోగలవా?" రావ్ అడిగాడు.

"మనమే నౌకను త్వరగా అన్ని దిక్కులకూ పరుగెత్తించి పడవల్ని దొరకబుచ్చుకోవాలి!"

కెప్టెన్ లార్సన్ అంచెనా ప్రకారం మరో అరగంటలో తుఫాను ప్రారంభమయింది.

గాలి వేగాన్ని పుంజుకోలేదు ఇంకా. అందుకే నారాయణరావు అతిత్వరగా తెరచాపల్ని విప్పగలిగాడు యీ లోపలే.

"తెరచాప స్తంభంమీదకు ఎక్కు నీవు! అక్కడ్నుంచి చూస్తే మన పడవలు ఎక్కడున్నదీ కనుపిస్తుంది."

నారాయణరావు గుండె గుభేల్ మంది. లోగడ తెరచాప స్తంభం ఎక్కడానికి హసన్ చేసిన హడావిడి గుర్తుకు వచ్చింది.

అయినా కెప్టెన్ తనను వదిలేయడు. నాలుగు తన్ని అయినా పైకి ఎక్కిస్తాడు. అందుకే ప్రాణాలకు తెగించి అయినా తన పరువు నిలబెట్టుకోవాలనుకున్నాడు.

చకచక త్రాటినిచ్చెన మీదుగా ఎగబ్రాకి తెరచాప స్తంభంపైకి చేరుకున్నాడు నారాయణరావు. దైవై, ఎనభై

అడుగుల ఎత్తునుంచి చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయ్. పళ్ళు కరుచుకుపోతున్నాయ్. గుండె లవిసిపోతున్నాయ్.

తెరచాప స్తంభంమీద నిల్చుని ఏ పడవ ఏ దిక్కున ఉన్నదో చెబుతుంటే, నౌకను అటువేపు ఉరికిస్తున్నాడు కెప్టెన్ లార్సన్.

దూరంలో ఉన్న పడవలు చిన్న చుక్కల్లా కనుపిస్తున్నాయ్. ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకుని, వణుకుతూ డెబ్భై అడుగుల ఎత్తైన తెరచాప స్తంభంమీద నిలబడి ఉన్నాడు నారాయణరావు.

కనుచూపుమేరలో నల్లని చుక్కలా కనబడుతోంది పడవ. అందులో అయిదుగురున్నారు. పడవలోకి ఎగసి పడుతున్న నీళ్ళను బయటికి తోడివేస్తున్నారు అందులోని వాళ్ళు.

ఆరు పడవలూ ఏయే దిక్కుల్లో ఉన్నాయో గుర్తుంచుకున్నాక దిగి రమ్మన్నాడు కెప్టెన్.

నారాయణరావు డెక్‌మీదకు దిగాడు. తుఫాను భీభత్సంగా తయారయింది. నౌక అటూ ఇటూ, సుడిగుండంలో చిక్కుకున్న జీవిలా అల్లల్లాడుతోంది.

పడవ చేరువలోకి రాంగానే కొంకీలుగల త్రాళ్ళను విసిరేస్తున్నారు. పడవకు కొంకీలు తగిలించంగానే, డెక్‌మీది పుల్లీమీదుగా త్రాళ్ళు లాగడంతో పడవ అలవోకగా పైకి వచ్చేస్తుంది.

అలాగే మొదటి పడవను పైకిలాగారు.

మళ్ళీ నౌక మరోవేపుకి మళ్ళింది. రెండో పడవ దొరికింది. మళ్ళీ నౌక గమనం మారింది. మూడో పడవను దొరకబుచ్చుకున్నారు.

పడవలోంచి నౌకలోకి మారిన వాళ్ళంతా 'స్టీరింగ్ వీల్' దగ్గరకు వచ్చి, తమ శక్తినంతా ధారబోసి నౌకను తుఫానునుంచి రక్షించే యత్నం చేస్తున్నారు.

ప్రకృతి భీకరంలో ఆ నౌక ఏ మూలకు? ఆ నౌకను నడిపే మానవులో? సముద్రంలో నీటిబొట్టులాంటి వాళ్ళు! కానీ అంత చిన్న మానవులు ప్రకృతి చేతిలో ఆటబొమ్మలా ఉన్న నౌకను పరిరక్షించటం అత్యద్భుతమైన విషయంగా తోచింది నారాయణరావుకి.

నౌక మరో పడవకోసం అన్వేషించసాగింది. నాలుగో పడవ దృష్టిలోకి వచ్చింది. కానీ అది తిరగబడిపోయింది. అందులోని అయిదుగుర్నీ తుఫాను పొట్టన బెట్టుకుంది.

"మనుష్యులే పోంగా లేనిది పడవ మాత్రం ఎందుకులే, వదిలేయండి! దాన్ని గురించి మనం శ్రమించటం వట్టి దండుగ!" అన్నాడు హాసన్.

"ఎంతమాట! ఒక మనుష్యుడు పోతే మరొకరు దొరుకుతారు కానీ పడవపోతే మళ్ళీ పడవ దొరకదు!" అని అరిచాడు కెప్టెన్ లార్సన్.

మనుష్యుల ప్రాణాలకన్న చెక్కతో చేసిన పడవకు అత్యధిక ప్రాధాన్యత నివ్వడం చూసిన నారాయణరావుకి ఒళ్ళు మండిపోయింది.

అదే సమయంలో పెద్ద అల రావటంతో నౌక అల్లల్లాడుతూ అటూ ఇటూ ఉధృతంగా ఊగిపోయింది. ఆ తాకిడిలో, పరాకుగా డెక్ మీద రెయిల్స్‌కి ఆనుకుని నిలబడ్డ నారాయణరావు ఒక్క ఎగురు ఎగిరి వెళ్ళి సముద్రంలో పడ్డాడు.

సమయానికి జాన్సన్ గమనించి త్రాడు విసిరేయటం

వలన అతడు బ్రతకగలిగాడు. లేకపోతే యమసదనానికి ప్రయాణం కట్టి ఉండేవాడే!

నాలుగో పడవపైకి లాగబడింది.

అప్పటికి తుఫాను ప్రచండంగా వీస్తున్నది. ఇక ఏ మాత్రం అన్వేషణ వీలుపడేట్టుగా లేదు. నౌకను తుఫానులో మునిగిపోకుండా కాపాడాలంటేనే అందరికీ తల ప్రాణం తోకకు వస్తున్నది.

నాలుగో పడవను రక్షించే యత్నంలో ఉండగా 'వీల్'ని కంట్రోల్ చేస్తున్న కాళీచరణ్ గూడా తనలాగే సముద్రంలో పడిపోయాడనీ, అయితే అందరూ పడవను పైకిలాగే పనిలో నిమగ్నులై అతడ్నెవరూ గమనించలేదనీ తెలిసింది నారాయణరావుకి. అతడికి చాలా విచారం వేసింది.

తుఫాను రాబోతున్నది ముందరే తెలిసినప్పుడు, కెప్టెన్ లార్సన్ ఆ పూటకు వేటను ఆపుచేయించి ఉంటే, ఇంత మంది ప్రాణాలు పోయేవికావు! అయినా మనుష్యుల ప్రాణాలకన్న జీవంలేని పడవలూ, ప్రాణంపోయిన సీల్ జంతువులే లార్సన్ దృష్టిలో విలువైనవి. నారాయణరావుకి లార్సన్‌పై కోపం ముంచుకొచ్చింది.

క్యాబిన్‌లో అందరికీ కాఫీ, బ్రాందీ ఇవ్వడింది.

"ఇక అందరూ వెళ్ళి నిద్రపోండి!" లార్సన్ ఆజ్ఞ జారీ చేశాడు.

"అపడవ గురించి కాళీచరణ్ ప్రాణాల్ని బలిపెట్టారు!" అన్నాడు నారాయణరావు, కెప్టెన్ వెనుకే వెడుతూ.

"వాడివల్ల మనకు పెద్ద ఉపయోగం లేదులే! ఇక వెళ్ళి పడుకో!" అంటూ పెదవి విరిచాడు కెప్టెన్ లార్సన్.

ఆనాటి వేటలో తుఫాను మూలంగా ఆరుగురు మనుష్యులూ, రెండు పడవలూ నష్టపోయింది "సీ డెవిల్."

పగలంతా శ్రమచేసి ఉండడంవలన నారాయణరావుకి పడుకోంగానే గాఢమైన నిద్రపట్టింది.

15

మరునాడుదయానికి తుఫాను తగ్గిపోయింది. ప్రొద్దెక్కాక మిగతా పడవలకోసం అన్వేషణ సాగింది.

ఆ ప్రాంతంలో "సీ డెవిల్"లాగే మరికొన్ని నౌకలు గూడ వచ్చినయ్ సీల్ జంతువుల వేటకు. అవిగూడ రాత్రి తుఫానులో తప్పిపోయిన తమ పడవలకోసం అన్వేషిస్తున్నయ్.

"రాయల్ క్వీన్" అనే మరో నౌకలోకి చేర్చబడినయ్ "సీ డెవిల్" తాలూకు పడవలు రెండు. కెప్టెన్ లార్సన్ ఆ నౌక కెప్టెన్‌తో మాట్లాడి ఆ రెంటినీ విడిపించుకుని వచ్చాడు. ఆ పడవల్లోని కళాసీలూ, నావికులూ, వేటగాళ్ళూ ఇంకో నౌకలోకి ఎక్కి ఆ రాత్రికి తలదాచుకున్నారు. తెల్లారాక తిరిగి 'సీ డెవిల్'ని చేరుకున్నారు.

మళ్ళీ వేట మొదలయింది. నౌక ప్రస్తుతం తిరుగాడే ప్రాంతంలో అప్పుడప్పుడు అక్కడక్కడా పొగమంచు వ్యాపించి ఉంటుంది, విమానం ఆకాశంలో ప్రయాణిస్తుంటే అడ్డువచ్చే మేఘాల్లాగ.

ఆ పొగమంచులో ప్రవేశించినపుడు నౌక అదేపనిగా సైరన్ మ్రోగిస్తూ ఉంటుంది. లేకపోతే మరో నౌక ఈ నౌకను ఢీ కొట్టుకునే ప్రమాదం ఉంది. ఈ పొగమంచులోనే పడవలు ఎక్కువగా తప్పిపోతుంటయ్. వాటిని వెదికి దొరకబుచ్చుకోవాల్సిన బాధ్యత మాతృనౌకదే!

థామస్ వంటశాలలో తీరిక లేకుండా పని చేస్తున్నాడు. హసన్, జాన్సన్‌లు రోజూ కెప్టెన్ చేతిలో చావుదెబ్బలు తింటూనే ఉన్నారు. మిగతా వాళ్ళు కుక్కలకన్న హీనంగా చూడబడుతూ వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారు.

నారాయణరావుతో మాత్రం కెప్టెన్ లార్సన్ స్నేహంగానూ, అభిమానపాత్రుడుగానూ ఉంటున్నాడు. కానీ అతడ్ని చూస్తుంటే, ఎప్పుడో ఒకప్పుడు అతడ్ని తప్పకుండా చంపాల్సిందే అనిపిస్తోంది నారాయణరావుకి. మళ్ళీ లార్సన్ జీవిత సమరంలో ఎప్పుడూ పోరాడుతూ, చేతికందిన దాన్నలా ధ్వంసం చేస్తూ, మరణాన్నే జయించిన వాడిలా తోస్తుంటాడు.

మరోక రోజు గడిచిపోయింది. నౌక స్టోర్ రూమ్‌లు సీల్ జంతువుల మృతదేహాలతో నిండిపోయినయ్.

ఆ మర్నాడు అయిదు పడవల్లో మరో పడవ అయిపు లేదు. దాంతోబాటుగా హసన్, జాన్సన్‌లుగూడ మాయమయారు.

కెప్టెన్ లార్సన్ కోపంతో తాండవం చేస్తున్నాడు. ఆదరాబాదరాగా వచ్చి స్టీరింగ్ వీల్‌ని తనే హ్యాండిల్ చేయసాగాడు. బహుశా ఆ ఇద్దరూ ఏ దిక్కుగా వెళ్ళి ఉంటారో అతడికి తెలుసేమో!

వాళ్ళిద్దరూ పారిపోవటానికి నారాయణరావు సాయపడ్డాడేమో అని కెప్టెన్ లార్సన్‌కి అనుమానం లేకపోలేదు. అందుకే కాబోలు తెరచాప స్తంభం మీదకు మరోకర్ని ఎక్కించాడు.

నౌక ఒక రోజంతా అన్వేషణ జరిపాక, స్తంభంపైన టెలిస్కోప్‌తో చూస్తున్న నావికుడికి ఒక పడవ కంటబడింది.

అందరూ డెక్ రెయిల్స్ దగ్గరకు పరుగెత్తారు. కెప్టెన్ లార్సన్ రైఫిల్ పుచ్చుకుని నిలబడ్డాడు. అతడి ముఖాన చిరునవ్వు వెలిసింది, ఎన్నడూ లేంది. హాసన్, జాన్సన్ లు దొరికారో, వాళ్ళిద్దర్నీ నిలువునా చర్మం వలిపిస్తాడు లార్సన్.

ఆ ఆలోచన రాంగానే నారాయణరావు క్యాబిన్ లోకి పరుగెత్తి, కెప్టెన్ రూమ్ లోంచి మరో రైఫిల్ తెచ్చాడు. హాసన్, జాన్సన్ ల వంటిమీద కెప్టెన్ చెయ్యేసిన మరుక్షణంలోనే నారాయణరావు చేతిలో రైఫిల్ ప్రేలటం ఖాయం, కెప్టెన్ తల మూడు పుచ్చెలుగా చీలటం ఖాయం అనుకున్నాడు నారాయణరావు.

అంతలో తెరచాప స్తంభంమీదనుంచి నావికుడు అరిచాడు. "ఆ పడవలో అయిదుగురున్నారోచ్!" అంటూ.

తను అనవసరంగా తొందరపడినందుకు లజ్జపడ్డాడు నారాయణరావు. ఖర్మకాలి తను రైఫిల్ ని తీసుకురావటం ఎవరూ చూడలేదు. లేకపోతే ఎంత రభస అయేదో!

నౌక క్రమేపీ ఆ పడవను చేరువయింది. ఆ పడవలో వాళ్ళు తెల్లని గుడ్డను ఊపుతూ, తమను పికప్ చేసుకోవలసిందిగా అరుస్తున్నారు.

నౌక పడవకు బాగా దగ్గర కాగానే, నౌకలోని వాళ్ళల్లో కొందరు విరగబడి నవ్వసాగారు, హిస్టీరియా ఫిట్ వచ్చినవాళ్ళలా.

నారాయణరావు అయోమయంగా చూశాడు. "ఎందుకు నవ్వుతున్నారు?" అని ఒక వ్యక్తిని అడిగాడు.

"ఆ పడవలో ఒక యువతి కనుపించటంలా?"

ఈ నౌకలోని వాళ్ళందరికీ ఆడదాని ముఖం చూసి ఎన్నో నెలలయింది. అందుకే గాబోలు ఈ సంతోషం! ఆ

యువతి ఎవరో ఈ దుర్భర, దుస్సహమైన నరకంలోకి అడుగు పెట్టబోతోంది. ఇక్కడి కామాగ్నిజ్వాలల్లో ఆమె దగ్ధమైపోవటం ఖాయం అనుకున్నాడు నారాయణరావు. ఇంతకన్న పడవ బోల్తాకొట్టి ఆమె చనిపోయివుంటే బాగుండేదేమో!

ఆమె డెక్ మీదకు రాంగానే, తనని తినేసేలా చూస్తున్న వ్యక్తుల ఆకలిని గుర్తించనిదానిలా, నిర్మలంగా చిరునవ్వు నవ్వింది.

కెప్టెన్ లార్సన్ ఆమెను నఖశిఖ పర్యంతం చూశాడు ఎగాదిగా. ఆతర్వాత "రావ్! ఈమెను కేబిన్‌లోకి తీసుకువెళ్ళి, ఆమెకేం కావాలో చూడు!" అంటూ ఆమె బాధ్యతను నారాయణరావుకి అప్పగించాడు.

ఆతర్వాత అతడు ఆమెతోబాటు వచ్చిన వ్యక్తుల్ని ప్రశ్నించసాగాడు.

ఆ యువతితో దారితీశాడు కేబిన్‌లోకి నారాయణరావు. ఆమె ఎర్రగా వుంది. పుష్టిగా, యవ్వనంలో వుంది. అవివాహితలా తోచింది.

"నాలుగురోజుల తుఫానులో మేం ప్రయాణిస్తున్న నౌక మునిగిపోయింది. అందరూ పడవల్లోకి మారి ప్రాణాలు దక్కించుకున్నాం! రేపుదయానికైనా మన నౌక ఏదైనా హార్బరు చేరుతుంది గదూ?" ఆమె అమాయికంగా అడిగింది.

అటువంటి స్త్రీకి ఈ నౌక పరిస్థితిని తను ఏమని వివరించగలడు? "ఇది ప్యాసింజర్ నౌక అయితే నీవు చెప్పినట్టే జరిగేది. కానీ ఈ కెప్టెన్ నరరూపరాక్షసుడు. ఈ నౌక ప్రత్యక్ష నరకం! మీరు ఇందులోకి రాకుండా

ఉండాల్సింది. ఇక తీరా వచ్చేశారు గనుక ఎటువంటి దుర్భరస్థితికైనా తల ఒగ్గేందుకు సిద్ధపడడం మంచిది!" అన్నాడు నారాయణరావు.

"మీరనేదేమిటో నాకు బోధపడడం లేదు!" అంది ఆమె, కళ్ళు పెద్దవిచేసి చూస్తూ.

"నేనన్న మాటల్ని మరోసారి మననం చేసుకోండి! అంతకన్న నేనింకేం చెప్పలేను."

ఆమె మళ్ళీ మాట్లాడలేదు. మౌనంగా అతడ్ని కేబిన్ రూమ్‌లోకి అనుసరించింది.

ఆ యువతి వేడినీళ్ళతో స్నానం చేసింది. ఆకలిమీద ఉందేమో ఆవురావురుమంటూ భోజనం చేసింది. ఆ తర్వాత బెడ్ మీద వాలిపోయి క్షణాల్లోనే గురక పెట్ట సాగింది.

ఆమెనేదో అడుగుదామనుకుంటూండగానే, డెక్ మీద కలకలం వినిపించింది. గది తలుపు దగ్గరకులాగి డెక్ మీదకు పరుగెత్తాడు నారాయణరావు.

16

నారాయణరావు డెక్ మీదకు చేరుకున్నాడు. అందరూ గుమిగూడినవేపుకు తనూ వెళ్ళాడు. దూరంగా మరో పడవ కనుపిస్తున్నది. అందులో తెడ్లు వేస్తూ, పడవను నడుపుతూ ఇద్దరు వ్యక్తులు కనుపిస్తున్నారు.

"సందేహం లేదు! వాళ్ళిద్దరూ హాసన్, జాన్సన్ లే!" అన్నారెవరో!

"నేను చెప్పలా? మనల్ని తప్పించుకుని ఆట్టే దూరం పోలేరని!" మరొకరు వంత పాడారు.

"వాళ్ళు దొరక్కుండాపోయినా బాగుండేది! లేదా పడవ బోల్తాపడి చనిపోయినా బాగుండేది, మళ్ళీ ఈ

రాక్షసుడి చేతిలో చిక్కేకన్నా!" పెద్దగానే అనేశాడు నారాయణరావు.

అంతలో అతని భుజాన ఎవరిదో చెయ్యి పడింది. గిరుక్కున వెనుదిరిగి చూశాడు నారాయణరావు.

కెప్టెన్ లార్సన్ చిరునవ్వుతూ నిలబడి వున్నాడు. అతడి చేతిలో రైఫిల్ వుంది ఇంకా.

"రావ్! ఆమె పేరూ, ఊరూ కనుక్కున్నావా?"

"లేదు! ఆమె చాలా అలిసిపోయినట్టుగా కనుపించింది. భోజనం చేయటం ముగిస్తూనే నిద్ర కుపక్రమించింది. మొన్న తుఫానులో తమ నౌక మునిగిపోయిందని మాత్రం చెప్పింది. అంతే!"

"వాళ్ళ వివరాలన్నీ నేను కనుక్కున్నానులే ఆ మగ వాళ్ళనుంచి. వాళ్ళు జపాన్ వెళ్తున్నారట వరల్డ్ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి. వెడుతూ ఈ ప్రమాదానికి గురైనారట. అయితే ఆమె గురించిన వివరాలేం అడగ లేదన్న మాట?" అతడు చిలిపిగా నవ్వుతున్నాడు.

ఆమె గురించి కెప్టెన్ ఆ విధంగా అడగటం అసహ్యమనిపించింది నారాయణరావుకి.

"ఇంతకీ ఆ హాసన్‌నీ, జాన్సన్‌నీ ఏం చేయదల్చుకున్నారు?" మాట మారుస్తూ అడిగాడు.

"ఇంకా ఏదీ నిర్ణయించలేదు. ఇప్పుడు మనకు దొరికిన నలుగురు మనుష్యులతో మనం నష్టం మూడొంతులు పూడినట్టే! ఇంకా వెతికితే మరో ఇద్దరు దొరక్కపోరు!"

"ఈ కొత్తవాళ్ళనన్నా మనుష్యులుగా ట్రీట్ చెయ్యి మిస్టర్ లార్సన్! అలా కాకుండా వాళ్ళనుగూడా క్రూరంగా చూశావో, నిన్ను నా చేతులమీదుగాకే

చంపుతాను!" ఆవేశంగా పలికాడు నారాయణరావు.

కెప్టెన్ లార్సన్ ఒక్క క్షణం అతడివంక ఎగాదిగా చూశాడు. ఆ తర్వాత ఫక్కున నవ్వేశాడు. "నిన్ను చూస్తుంటే ఇప్పుడు నాకు పట్టరాని ఆనందం వేస్తున్నది. పిల్లిలా చేరినవాడివి పులిలా తయారయావు. ఇప్పుడు నీవు మొనగాడి వనిపించుకున్నావ్! ఈ నౌకలో ఎవరి పేరు చెబితే జనం మంచినీళ్ళుగూడ ముట్టకుండా గడగడలాడి పోతారో, ఆ వ్యక్తినే ముఖాముఖి ఎదుటపడి చంపుతానని బెదిరించగల ధైర్యవంతుడివయావ్! శెభాష్!"

"అది సరే! ఇంతకీ హసన్‌కీ, జాన్సన్‌కీ ఏం శిక్ష వేయబోతున్నావో చెప్పు. డెక్ మీదకు వచ్చాక వాళ్ళ మీద నీవు చేయి వెయ్యటానికి వీల్లేదు తెలిసిందా!" నారాయణరావు ఇంకా గంభీరంగానే కనుపించాడు.

"మిస్టర్ రావ్! నా వాగ్దానంమీద నీకు నమ్మకం వుందా?"

"లేకేం? ఉంది!"

"అయితే నేను హసన్, జాన్సన్‌లమీద చెయ్యి వెయ్యను. సరా? మరి నీవు నన్ను చంపటానికి యత్నించనని ప్రమాణం చెయ్యి!"

అతి కర్కోటకుడు అయిన కెప్టెన్ లార్సన్ ఈ విధంగా, ఇంత తేలికగా తనకు లొంగిపోతాడని నారాయణరావు కలలోగూడ ఊహించలేదు. హసన్, జాన్సన్ల మీద లార్సన్ చెయ్యి వేయకుండా వుంటే తను యేం చేయటానికైనా సంసిద్ధుడే.

అందుకే వెంటనే ఒప్పుకున్నాడు నారాయణరావు, ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

17

బైనాక్యులర్స్ తీసుకుని పడవలోకి చూశాడు కెప్టెన్. అందులో ఆహారపదార్థాలు లేవు. నీటి పీపా మాత్రమే వుంది. రెండురోజుల్నించి ఆహారం లేక వాళ్ళ ముఖాలు పీక్కుపోయినయ్. వాళ్ళవంక చూసి మందహాసం చేశాడు కెప్టెన్ లార్సన్.

నౌక నిదానంగా పోతూనే వుంది. క్షణాల్లో పడవ చేరువయింది. డెక్ మీదనుంచి అందరూ మౌనంగా పరీక్షిస్తున్నారు. అందరి మనస్సులోనూ భయం, ఆత్రుత, ఆందోళనా గూడుకట్టుకుని వున్నయ్. తీరా వాళ్ళు డెక్ మీదకు వచ్చాక ఎన్ని చిత్రహింసల పాలవాలో అని ఆలోచిస్తున్నారు.

నౌక పడవ ప్రక్కకు వచ్చింది. నౌకను ఆపి, త్రాళ్ళు దింపి పడవను పైకి లాక్కోవాలి. అయితే కెప్టెన్ లార్సన్ నౌకను ఆపేందుకు ఆజ్ఞ జారీ చేయలేదు. పైపెచ్చు క్యాబిన్ రూమ్‌లోకి నడిచి, నౌక వేగాన్ని హెచ్చించమన్నాడు.

ప్రాణాలరచేతిలో పెట్టుకుని ఆశగా చూస్తున్న హాసన్, జాన్సన్‌ల పడవను దాటి నౌక ముందుకు వెళ్ళిపోతోంది. సినిమా సీన్‌లోలాగ పడవ క్రమేపీ దూరమవసాగింది. కెప్టెన్ లార్సన్ వికటంగా పెద్దగా నవ్వాడు. ఆ నవ్వు ఆల్సేషియన్ కుక్క మొరిగినట్టుగా వుంది.

పడవకూ, నౌకకూ రెండుమైళ్ళ ఎడం ఏర్పడింది. లార్సన్ అప్పుడు నౌకను ఆపాడు. పడవలో వ్యక్తులకు "రండి! రండి!" అంటూ చెయ్యి ఊపుతూ సంజ్ఞ చేశాడు కెప్టెన్ లార్సన్.

ఎదురుగాలిలో రెక్కలు ముక్కలయేలా ఆశగా తెడ్లు వేస్తూ నౌకకి చేరువయారు హసన్, జాన్సన్‌లు తమ పడవలో.

"మీకు నిజంగా నౌకలోకి రావాలని వుందా? నాపై మళ్ళీ హత్యాప్రయత్నం చేయరు గదా?" లార్సన్ పెద్దగా అరిచాడు. "అలా అయితే మా నౌకను వెంబడించి రండి!" అంటూ మళ్ళీ నౌకను బయలుదేరదీశాడు.

నౌకకూ, పడవకూ దూరం మళ్ళీ ఎక్కువై పోసాగింది. ప్రాణాలరచేతులో పెట్టుకున్న ఆ వ్యక్తులతో కెప్టెన్ లార్సన్ చెలగాట మాడుతున్నాడు. బహుశా వాళ్ళు తనపై అత్యాచారం జరిపినందుకు ఈ రకంగా శిక్షిస్తున్నాడేమో లార్సన్, వాళ్ళకు బుద్ధివచ్చేలా చేయటానికి.

హసన్, జాన్సన్‌లు కూర్చున్న పడవ సీ డెవిల్‌ని వెంబడిస్తూనే వుంది. వాళ్ళ ప్రాణాలు ఆకలిమంటలో గిలగిల కొట్టుకుంటున్నవి.

"ప్రాణభయం చూశావా ఎంత పని చేయిస్తున్నదో! ఈ నరకంలోంచి పారిపోవాలని యత్నించారు. ఎటు చూసినా వేలమైళ్ళకొలదీ సముద్రమే కానీ, భూభాగం చేరలేమని తెలిశాక వాళ్ళు మళ్ళీ ఈ కూపంలోకి రావాలనే యత్నిస్తున్నారు" థామస్ నారాయణరావు చెవిలో గొణిగాడు.

"కెప్టెన్ వాళ్ళకు బుద్ధివచ్చేలా చేయాలని అలా ఏడిపిస్తున్నాడు. చివరకు వాళ్ళని నౌకలోకి తీసుకుంటాడులే!" నారాయణరావు మెల్లిగా పలికాడు.

"అలానే నమ్ముకుని కూర్చోండి!" థామస్ పెదవి విరిచాడు.

నౌక పడవనుంచి దాదాపు అయిదారుమైళ్ళు వచ్చే శాక నౌకను ఆపుచేశాడు లార్సన్. అందరూ డెక్ మీద చేరి పడవ గమనాన్నే తిలకిస్తున్నారు ఆసక్తిగా. పడవ అంతకంతకూ దగ్గరకు వచ్చేస్తోంది. ఆ అయిదుమైళ్ళ దూరాన్ని అధిగమించేందుకు పడవలో వాళ్ళకు గంటన్నర టైమ్ పట్టింది.

పడవ చేరువలోకి రాగానే నౌక మళ్ళీ వేగాన్ని పుంజుకుంది. ప్రాణాలకు తెగించి, ఓపికనంతా కూడగట్టుకుని హసన్, జాన్సన్‌లు నాలుగు గంటలసేపు 'సీ డెవిల్' నౌకను వెంబడించారు తమ పడవలో.

వర్షం ప్రారంభమయింది. కప్పుకునేందుకు ఏ ఆధారమూ లేని పడవలో వ్యక్తులు ఏమైపోతారో అని అందరూ ఆతృత పడసాగారు.

వర్షంలో పడవ కనబడడంలేదు. అయినా నౌక తన గమనాన్ని సాగించింది. వాన వెలిసేసరికి వాళ్ళ పడవ జాడే లేదు. బహుశా హసన్, జాన్సన్‌ల కష్టాలు తీరిపోయి వుండాలి, వాళ్ళు పరలోకానికి ప్రయాణం కట్టి వుండాలి.

జరిగిన దారుణాన్ని ఆలోచిస్తూ ఎవరికి వారే మౌనంగా వుండిపోయారు.

నౌకలోకి కొత్తగా వచ్చిన వ్యక్తుల్లో ఒకడు, 'భగవంతుడా! ఎలాంటి నౌకలోకి వచ్చి పడ్డాంరా!' అనుకున్నాడు.

నారాయణరావు కోపంగా స్టీరింగ్ వీల్ ముందున్న కెప్టెన్ లార్సన్ దగ్గరకు నడిచాడు.

"వాళ్ళమీద చెయ్యి వేయనని నాకు ప్రమాణం చేసింది ఇందుకేనా?" అనడిగాడు కెప్టెన్‌ని.

"అవును! నేను వాళ్ళని ఏమన్నా చేశానా? వాళ్ళ ఖర్మకు వాళ్ళే పోయారు" కెప్టెన్ లార్సన్ పెద్దగా నవ్వాడు. "నా మాట నిలబెట్టుకున్నానా లేదా? నేను వాళ్ళమీద చేయి చేసుకోలేదు!"

ఈ పథకాన్ని ముందరే ఆలోచించుకునే, లార్సన్ తనకు శుష్క వాగ్దానం చేశాడన్నమాట! నారాయణ రావుకి కోపంతో మాట పెగల్లేదు.

18

నౌకలోకి కొత్తగా వచ్చిన వ్యక్తులుగూడ కళాసీలుగా మార్చబడ్డారు. ముందు వాళ్ళు అభ్యంతరం తెలిపినా, చివరకు అంగీకరించక తప్పలేదు. హసన్, జాన్సన్‌లకు అతడు విధించిన శిక్షను కళ్ళారా చూశాక, వాళ్ళకు కెప్టెన్ లార్సన్ అంటే ఎనలేని భయం పట్టుకుంది.

నారాయణరావు ఆ యువతి గురించి వివరాలు కను క్కున్నాడు. ఆమెగూడ భారతీయ వనితే! ఆమె పేరు అనితా ఛటర్జీ! కలకత్తాలో నివాసం! జపాన్ వెడుతోంది ఎగ్జిబిషన్ చూడ్డానికి. ఆమె తండ్రి లక్షాధికారి. పైపెచ్చు అనితా ఛటర్జీ నవలా రచయితట. ఇంగ్లీషులో ఆమె వ్రాసినవి రెండు నవలలు ప్రచురితమైనవని చెప్పింది.

"ఈ నౌకలో మీరు ఉండటం క్షేమం కాదు. అదను చూసుకుని పారిపోవాలి మనం!" అన్నాడు నారాయణ రావు.

"అవును! ఆ కెప్టెన్ విపరీతచేష్టల్ని చూస్తుంటే నాకు గుండె బేజారయిపోతున్నది!" అంది అనితా.

"మీరేం భయపడకండి. మీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను సరా?"

అనితా ఛటర్జీ కృతజ్ఞతగా చూసింది. ఆ చూపుల్లో నారాయణరావు తను ఆమె కోసం సప్తసముద్రాల్నయినా దాటాలనేంత ధైర్యం పుంజుకున్నాడు.

కెప్టెన్ లార్సన్ నుంచి అనితకు కబురు వచ్చింది, "కెప్టెన్ పిలుస్తున్నాడు!"

అనిత నారాయణరావు వంక చూసింది. "ఏం భయం లేదు. వెళ్ళి రండి!" అన్నట్టుగా నారాయణరావు కళ్ళతోనే సైగ చేశాడు.

అనిత భయపడుతూనే కెప్టెన్ గదిలోకి వెళ్ళింది. ఆమె వెనకనే నారాయణరావూ వెళ్ళాడు. అయితే అతడు గదిదగ్గరకు చేరేసరికి, గదితలుపు లోపల గడియ వేయబడింది.

నారాయణరావు మోకాళ్ళ మీదుగా వంగి కూర్చుని, కీ హోల్ లోంచి లోపల జరుగుతున్నదాన్ని చూడటానికి యత్నించాడు.

కెప్టెన్ లార్సన్ అనితను చిరునవ్వుతో ఆహ్వానించాడు. కాఫీ, బ్రెడ్ ఆఫర్ చేశాడు. అనిత వాటిని నిరాకరించింది.

ఆ తర్వాత లార్సన్ ఆమె కూర్చున్నచోటికి లేచి వచ్చాడు. ఆమె గడ్డంక్రింద వేలు పెట్టి ముఖాన్ని పైకెత్తాడు. ఆమె పెదవులపై చుంబించబోయాడు. అనిత ముఖం త్రిప్పుకుంది.

ఈ దఫా లార్సన్ రెండుచేతుల్తో ఆమె చెక్కిళ్ళమీద నొక్కి, ఆమె ముఖంలో ముఖం పెట్టాడు.

అనిత అతడ్ని నెట్టింది. లార్సన్ వెనక్కి పడిపోయాడు. అతడిలో మృగతృష్ణ తీవ్రరూపానికి వచ్చింది. అనితను బలవంతంగా తన కౌగిట్లో బంధించాడు.

బయటనుంచి చూస్తున్న నారాయణరావు కోపంతో తన ఒళ్ళే తను మరిచిపోయాడు. తలుపుమీద దబదబ బాదాడు.

అనిత పరుగెత్తుకుంటూ వచ్చి తలుపు తెరిచింది రొప్పు కుంటూ. నారాయణరావు గుహలో ప్రవేశించే పులిలా ఠీవిగా అడుగులు వేసుకుంటూ లార్సన్ నిల్చున్న చోటికి వెళ్ళాడు. అతడి చేతిలో పదునైన కత్తి ఉంది.

ఆ కత్తిని లార్సన్ టేబుల్ మీద గుచ్చాడు.

"మిస్టర్ లార్సన్! ఆమె నీ పశుకామానికి బలి అయేందుకు వీల్లేదు, నా కంఠంలో ఊపిరి ఉండగా!"

కెప్టెన్ లార్సన్ అతడివంక నిప్పులు గ్రక్కుతూ చూశాడు.

"అబ్బ! పెద్ద మొగాడు వచ్చాడు! ఈ బింకం ఎన్నాళ్లో నేనూ చూస్తాను" అన్నాడు.

అనితను వెంటబెట్టుకుని నారాయణరావు బయటకు వచ్చేశాడు కెప్టెన్ గదినుంచి.

కెప్టెన్ లార్సన్ కోపోద్రిక్తుడైనాడు. అయితే అతని కోపాన్ని ఎవరో ఒకరిమీద చూపించాలి. ఆ రోజు థామస్‌కు ఆయువు మూడింది.

భోజనాల సమయంలో లార్సన్ ఎగాదిగా చూశాడు థామస్ వంక.

"నీకు లోగడే ఆఖరు హెచ్చరిక చేశాను వంట గురించి. నీ డ్రెస్ కూడా తెల్లగా ఉండాలని చెప్పానా లేదా? నా మాటల్ని ఖాతరు చెయ్యనందుకు నీవు తగిన శిక్షని అనుభవిస్తావ్!"

థామస్ ముఖం మంచులా తెల్లబారిపోయింది. మరు క్షణమే అతడు అక్కడ్నుంచి పరుగు లంకించుకున్నాడు.

కెప్టెన్ లార్సన్ నలుగురు కళాసీల్ని పురమాయించాడు థామస్‌ని పట్టుకు రేందుకు. థామస్ ఇంజన్ రూమ్ చుట్టూ, క్యాబిన్ గదులూ అన్నీ పిచ్చికుక్కలా పరుగెత్తసాగాడు. కళాసీలు అతడి వెంటబడ్డారు తోడేళ్ళలాగ.

మిగతా వాళ్ళు ఈ సరికొత్త వినోదాన్ని చూసేందుకు వేగిర పడుతున్నారు.

థామస్ పట్టుబడ్డాడు. అతడి నోటంట రక్తం కారు తోంది. గుండెలు పగిలేలా రొప్పుతున్నాడు అతడు.

కెప్టెన్ లార్సన్ వాడి నడుముకు త్రాడుకట్టాడు. ఆ త్రాటి రెండో కొసను డెక్ మీద స్తంభానికి కట్టారు. ఇద్దరు కళాసీలు థామస్‌ని ఎత్తి సముద్రంలోకి విసిరేశారు.

థామస్ పిచ్చిగా అరుస్తున్నాడు ప్రాణభయంతో.

అయితే అతడి అరుపుల్ని ఎవరూ లక్ష్యపెట్టలేదు. పైపెచ్చు డెక్ మీద చేరిన కళాసీలూ, వేటగాళ్ళూ, నావికులూ అందరూ పొట్టచెక్కలయేలా నవ్వుతూ ఈ వినోదాన్ని ఆనందిస్తున్నారు.

అనిత, నారాయణరావు, కొత్తగా వచ్చిన నలుగురు వ్యక్తులు మాత్రం విచారంతో గమనిస్తున్నారు జరుగుతున్న దారుణాన్ని.

సముద్రం ప్రశాంతంగా ఉంది. కానీ వానవల్ల, నీళ్ళు రక్తాన్ని గడ్డకట్టించేటంత చల్లగా ఉన్నాయ్.

యాభై అరవై అడుగుల పొడవుగల త్రాడు నౌక నుంచి సముద్రంలోకి వ్రేలాడుతోంది. ఆ త్రాడు చివర నీళ్ళలో మునుగుతూ, తేలుతూ నౌకచేత లాగబడు తున్నాడు థామస్.

థామస్ పెద్దగా అరిచాడు. "అయ్యో! షార్క్ చేప వచ్చేస్తోంది! నన్ను రక్షించండి!"

"కొంగ వెధవ! అలా అరిచి దొంగ ఎత్తు వేస్తున్నాడు, పైకి తీస్తారని!" డెక్ మీద ఎవరో అన్నారు.

దూరంగా నీళ్ళు ఎవరో విరజిముతూన్నట్టుగా పైకి లేస్తున్నయ్.

"నిజంగానే షార్క్! త్వరగా త్రాడులాగండి! త్రాడు పైకిలాగండి!" కెప్టెన్ లార్సన్ గొంతు డెక్ అంతటా ప్రతిధ్వనించింది.

పదిమంది కలసి త్రాడుని జరజర పైకిలాగటం మొదలెట్టారు.

అరుస్తూ, నీళ్ళల్లో కల్లోలం సృష్టిస్తున్న థామస్ షార్క్ చూపుల్లో పడ్డాడు. షార్క్ ఇంకా వేగంగా అతడివైపుకు వచ్చేస్తోంది. అతడు లాగబడే వేగంకన్నా షార్క్ ప్రయాణ వేగమే ఎక్కువగా ఉంది.

అటు థామస్, ఇటు షార్క్ ఇద్దరూ ఒకేసారి నౌక దగ్గరకు చేరారు. కెప్టెన్ లార్సన్ తన బలాన్నంతా వినియోగించి త్రాడుని లాగాడు.

థామస్ నీళ్ళలోంచి పైకి లేచాడు. అంతకంతకూ పైకి చేరుతున్నాడు.

తన కంటబడిన ఆహారం నోటికందకుండా పోతున్నందుకు షార్క్‌కి ఆగ్రహం కలిగింది కాబోలు ఒక్క ఎగురు ఎగిరింది నీళ్ళలోంచి.

నోరు తెరిచి మళ్ళీ మూసుకుంది! తిరిగీ నీళ్ళలో పడిపోయింది షార్క్.

థామస్ పిచ్చిగా అరుస్తున్నాడు. అతడు డెక్ మీదకు లాగబడ్డాడు. అతడి శరీరంనుంచి నీళ్ళు కారుతున్నయ్. అతడి రెండు కాళ్ళూ తొడలవరకూ తెగిపోయాయి. ఆ క్రింది భాగం షార్క్ చేప నోట్లో ఉండిపోయింది. తెగి

పోయిన కాళ్ళ మొండేలనుంచి రక్తం స్రవిస్తోంది. డెక్ నేలమీద రక్తపు మడుగు ఏర్పడింది.

ఇదంతా చూస్తున్న అనిత స్పృహతప్పి పడిపోయింది.

"నా పథకంలో పార్క్ లేదు. థామస్ అదృష్టం బాగోలేదు. అందుకే అకస్మాత్తుగా రంగంలోకి పార్క్ వచ్చింది. థామస్‌ను తిరిగి సముద్రంలో పారేయండి" అని మామూలుగా, అసలేం జరగనంత సాధారణంగా అన్నాడు కెప్టెన్ లార్సన్.

19

"సీ డెవిల్" తిరుగాడుతున్న సముద్రప్రాంతం చాలా ప్రమాదకరమైన ప్రదేశం. అక్కడ సీల్ జంతువులు ఎక్కువగా దొరికేమాట నిజమే! కానీ సముద్రం భీభత్సంగానూ ఉంటుంది. రోజుల తరబడి మేఘావృతమై, సూర్యుడు కనబడడు.

కెప్టెన్ లార్సన్ భోజనం చేస్తుండంగా కళాసీ ఒకడు పరుగెత్తుకొచ్చాడు.

"మనల్ని మరో స్టీమర్ వెంబడిస్తోంది! బహుశా అది మీ సోదరుడిదై ఉండొచ్చనుకుంటాను!" అని చెప్పాడు.

తింటున్న భోజనం వదిలేసి కెప్టెన్ లార్సన్ డెక్ మీదకు పరుగెత్తాడు.

'సీ హాక్' స్టీమర్, స్టీమ్‌తో నడిచే అధునాతన నౌక ఆ ప్రాంతంలోకి వచ్చింది. దాని కెప్టెన్ థాటికి మరెవరూ నిలవలేరు. సీహాక్ అక్కడ 'సీల్స్'ని వేటాడుతుంటే, మరో నౌక ఆ ప్రాంతంలో తిరుగాడలేదు.

'సీహాక్'కి పద్నాలుగు మోటార్ బోట్లున్నయ్. కెప్టెన్ లార్సన్‌వి ఆరు పడవలు.

ఆ రోజు 'సీ డెవిల్' తాలూకు పడవలకి ఒక్క జంతువుకూడా దొరకలేదు. ఆ పడవలన్నీ ఖాళీగా తిరిగి వచ్చినయ్. అందులో వేటగాళ్ళు 'సీహాక్'ని తెగ తిట్టి పోస్తున్నారు.

సముద్రంమీద ఒకవైపున దట్టమైన పొగమంచు పట్టింది. ఆ పొగమబ్బు ఇంకా ఉత్తరంగా వ్యాపిస్తోంది.

ఆ పొగమంచులో 'సీహాక్' తాలూకు పడవలు దారి కనపడక సీడెవిల్ తిరుగుతున్న ప్రాంతంలోకి వచ్చాయి.

కెప్టెన్ లార్సన్ పర్యవేక్షణ క్రింద వేటగాళ్ళు అవతలి నౌక పడవను పట్టి తెచ్చారు. అందులోని ముగ్గురూ కెప్టెన్ లార్సన్ చేతివాటం రుచిచూచాక అక్కడే ఉండిపోవటానికి అంగీకరించారు.

ఇనుమడించిన ఉత్సాహంతో లార్సన్ మరో పడవను ఎటాక్ చేశాడు. అదీ తేలికగానే స్వాధీనమైంది. మూడో పడవలో వాళ్ళదగ్గర రైఫిల్స్ ఉన్నయ్.

ఇరుపక్షాలకూ కాల్పులు సంభవించినయ్. ఆ కాల్పుల్లో 'సీహాక్' తాలూకు ముగ్గురు వ్యక్తులూ మరణించారు.

కాల్పులు విని సీహాక్ తాలూకు పడవలన్నీ ఒకచోట చేరినయ్. విడివిడిగా వైరిపోతే శత్రువు తేలిగ్గా పట్టుకో గలడని, అవన్నీ కలిసి కట్టుగా యుద్ధానికి సిద్ధమైనయ్.

వాటికి అండగా 'సీహాక్' నౌకగూడ వచ్చి చేరింది అక్కడకు. అందులోంచి ఫిరంగులు ప్రేలినయ్. అయినా 'సీడెవిల్' వాటి రేంజ్ కి అవతలే ఉండడంవల్ల లక్ష్యాని తగల్లేదు అవి.

కెప్టెన్ లార్సన్ స్టీరింగ్ వీల్ గిరగిర త్రిప్పేశాడు నౌక గమనాన్ని మళ్ళించి, పొగమంచు తెరలోకి పోని చ్చాడు నౌకను.

అరగంట ప్రయాణించి పొగమంచులోంచి బయట పడింది నౌక.

సముద్రం ప్రశాంతంగా ఉంది. ఆకాశంలో సూర్యుడు వెలుగుతున్నాడు. ప్రస్తుతానికి 'సీహాక్' ఎదుర్కొనే ప్రమాదం తప్పిపోయినట్టే.

"మనం దొరక్కుండా తప్పించుకున్నామని, నా సోదరుడు శాపనార్థాలు పెడుతుంటాడు ఈపాటికి!" అంటూ తెగనవ్వాడు కెప్టెన్.

20

తన తాత్కాలిక విజయాన్ని సెలిబ్రేట్ చేసుకోవటానికి కెప్టెన్ లార్సన్ నౌకలో అందరికీ బ్రాందీ, విస్కీ, రమ్ పానీయాల్ని సరఫరా చేశాడు. తనుకూడా పీకలదాకా తాగి తన గదిలో బెడ్ మీద వాలిపోయాడు.

సామాన్యంగా లార్సన్ అంత ఎక్కువగా తాగంగా నారాయణరావు చూడలేదు. ఇక కనీసం రెండుగంటల సేపన్నా లార్సన్ మత్తులో ఉంటాడు. తను ఇక్కడ్నుంచి తప్పించుకోవటానికి ఇదే అనువైన సమయం.

నారాయణరావు గబగబ వెళ్ళి అనితను లేపాడు. "మనం ఇక్కడ్నుంచి పారిపోవాలి! త్వరగా రా!" అని తొందరచేశాడు.

నౌకలో చాలా భాగం తాగి ఎక్కడివారక్కడ పడిపోయారు. స్టీరింగ్ వీల్ దగ్గర మాత్రం ముగ్గురు కళాసీలు కనిపెట్టుకుని ఉన్నారు.

ఒక పడవలోకి దుప్పట్లూ, టార్పాలిన్, చలికోట్లు, కాఫీల్ని, నీరూ, ఆహారం టిన్నుల్నీ చేర్చాడు. కేబిన్ రూమ్‌లోకి వెళ్ళి రైఫిల్ ఒకటి, తూటాల బెల్ట్‌నీ తీసుకొచ్చాడు.

ఓడ వెనుకభాగంలోంచి, కళాసీల కంటబడకుండా పడవను నీళ్ళల్లోకి దించాడు. అనితను తీసుకుని దాంట్లోకి దిగజారాడు.

కత్తితీసి పడవకు కట్టిఉన్న నౌక త్రాళ్ళను కోసి వేశాడు నారాయణరావు.

నౌకనుంచి పడవ వేరయింది. నౌక వెళ్ళిపోతోంది. నిశ్చలంగా ఉన్న పడవకు క్రమేపీ దూరం కాసాగింది.

"మనం ఎక్కడున్నాం?" అనిత అడిగింది.

"అదేమో తెలీదు. కానీ ఈ దిక్కుగా పోతే జపాన్ తీరం చేర్తాం. అక్కడ భారత రాయబారకార్యాలయానికి వెళ్ళి రిపోర్ట్ ఇవ్వాలి మనం!"

"కానీ మీరు దుస్సాహసం చేస్తున్నారేమో నా గురించి! మీ ధైర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేను" అనిత మెచ్చుకుంది అతడ్ని.

"ఆ ఘనత మీకు దక్కుతుంది. మీ గురించే నేను ఆ నరకంలోంచి బయటకు వచ్చేస్తున్నాను. అదే మీరు తటస్థపడకుండా ఉంటే నేనింకా అక్కడే మగ్గుతూండేవాడ్ని!"

చీకట్లు అలముకుంటున్న అనంత సాగరంలో మామూలు పడవలో ఒక పురుషుడూ, ఒక స్త్రీ ముందుకు సాగిపోతున్నారు.

ఆ పడవలో వారిద్దరూ చాలా కష్టాల్ని ఎదుర్కోవలసి వచ్చింది. పగలంతా గాలి ఉధృతంగా వీచేది. రాత్రిళ్ళు విపరీతమైన చలి. దిక్కు తెన్నూ తోచకుండా పడవ సాగిపోతోంది. ముందుకే పోతున్నదో, వెనక్కి పోతున్నదో తెలియటంలేదు.

నాలుగు రోజుల ప్రయాణం తర్వాత వారు ప్రశాంత ప్రదేశానికి చేరుకోగలిగారు. పైగా కన్నుమూపు మేరలో చిన్న ద్వీపం కనుపించింది.

సముద్రంమీద తుఫాను ఎక్కడ వస్తుందో అని ప్రాణాలు బిగబట్టుకున్న నారాయణరావుకి ప్రాణం లేచి వచ్చింది.

పడవను ద్వీపం వేపుకు మళ్ళించాడు.

పడవను ఒడ్డుకు పట్టించి ఇసుకలోకి లాగాడు నారాయణరావు. అనిత పడవలోంచి భూమ్మీదకు దూకింది చిన్నపిల్లలా.

నేలమీది ఇసుకను గుప్పిట్లోకి తీసుకుని కళ్ళకద్దుకుంది. "భూమాతను స్పృశించి ఎన్నాళ్ళయిందో!" అంటూ ఇసుకలో కూలబడింది ఆమె.

"ఈ ద్వీపంలో నరసంచారం వున్నదేమో చూసి వస్తాను!" అన్నాడు నారాయణరావు.

"అమ్మో! నాకు భయం! నేను ఒంటరిగా వుండలేను. అయినా ఇప్పుడేం తొందరని? హాయిగా విశ్రాంతి తీసుకుని తర్వాత తీరిగ్గా శోధించవచ్చు!" అంది అనిత.

నారాయణరావు టార్పాలిన్‌తో టెంట్ వేశాడు. అందులోకి తమ సామాన్లను చేరవేశాడు. స్టౌవ్ వెలిగించి వేడివేడి కాఫీ పెట్టుకుని త్రాగారు. తమ కష్టాలన్నిటినీ మరిచి, పిక్‌నిక్‌కి వచ్చిన నూతన దంపతుల్లా ఉల్లాసంగా గడిపారిద్దరూ ఆ రోజంతా.

మర్నాడు ద్వీపం అంతా కలయదిరిగారిద్దరూ. అది చాల చిన్నద్వీపం. ఎక్కడా నరసంచారం లేదు. దుబ్బులూ, పొదలూ తప్పిస్తే ఆట్టే చెట్లుగూడ లేవు.

తీరం వెంబడే సీల్ జంతువులు సముద్రంలోంచి ఇసుకలోకి వచ్చి పొర్లాడుతున్నయ్.

మధ్యమధ్యలో ఒక జంతువు నోట్లో చేపను కరుచుకుని వస్తుంది. మిగతా జంతువులు ఆ చేపకోసం దాంతో కలబడతయ్.

నారాయణరావు రైఫిల్‌తో నాలుగైదు జంతువుల్ని కాల్చి చంపాడు. వాటి కొవ్వుతీసి, దాంతో రాత్రిపూట దీపం వెలిగించుకున్నారు.

ఆ సాయంకాలం గాలి ఝంఝామారుతంగా వీయసాగింది.

"తుఫాను వచ్చేలాగుంది!" అన్నాడు నారాయణరావు.

టార్పాలిన్ టెన్ట్ గాలికి లేచిపోకుండా మరింత కట్టుదిట్టం చేశాడు. ఆతర్వాత దుప్పట్లు కప్పుకుని వెచ్చగా పడుకున్నారు తీయని కలలు గనటానికి యత్నిస్తూ.

ఆ రాత్రంతా తుఫాను వీచింది. మర్నాడు తెల్లవారు జామునకి తిరిగీ వాతావరణం శాంతించింది.

నారాయణరావుకన్న ముందుగా ఆనితే లేచింది. టెంట్ బయటకువచ్చి సముద్రంమీదకు చూసింది. ఆమె కళ్ళను ఆమే నమ్మలేకపోయింది.

గబగబ వెళ్ళి నారాయణరావుని లేపింది. ఇద్దరూ సముద్రపు అలల దగ్గరకువచ్చి మరీ చూశారు.

తీరానికి దగ్గరలో "సీ డెవిల్" గాలికి నీళ్ళల్లో ఊగుతోంది. దాని తెరచాప స్తంభం త్రాళ్ళు తెగిపోయి వున్నయ్.

"ఆశ్చర్యంగా వుందే! సీ డెవిల్ ఇక్కడికెలా రాగలిగిందబ్బా?" నారాయణరావు నోరు తెరిచి చూస్తుండిపోయాడు.

"పోనీ వచ్చిందే అనుకోండి! అందులో మనుష్యులు ఒక్కరూ కనబడరేం?" అనిత అడిగింది.

"అదీ నిజమే సుమా! పద వెళ్ళి లోపల చూద్దాం!" అంటూ ఇద్దరూ టెంట్ దగ్గర కొచ్చారు.

అనిత లోడ్ చేసివున్న రైఫిల్ ని తీసుకుంది. పడవలో ఎక్కి దిక్కులేకుండా పడివున్న "సీ డెవిల్" ని చేరుకున్నారు.

త్రాటినిచ్చెన మీదుగా పైకి ఎక్కారు.

"ఏమిటీ వింత? ఎవరూ లేరే లోపల!" అంది అనిత డెక్ మీద కలయజూస్తూ.

"అదే నాకూ అంతు పట్టటంలేదు!" అన్నాడు నారాయణరావు.

మరుక్షణంలో కాబిన్ గదుల్లోంచి గుండె లవిసి పోయేలా కేక వినవచ్చింది.

"ఎవరది? త్వరగా రండి! నన్ను రక్షించండి!" ఆ కంఠం కెప్టెన్ లార్సన్ దని నారాయణరావు ఇట్టే పోల్చుకున్నాడు.

అనిత రైఫిల్ ని గురిపెట్టి, నారాయణరావు వెనకనే నడిచింది.

క్యాబిన్ గదిలో అన్ని వేపులా తడుముకుంటూ తచ్చాడుతూ కలయ దిరుగుతున్నాడు కెప్టెన్ లార్సన్.

"కెప్టెన్ లార్సన్! ఏం జరిగింది?" అంటూ అడిగాడు నారాయణరావు.

ఆ శబ్దం వచ్చినవేపుకు తిరిగాడు లార్సన్.

అనిత భయంతో కెవ్వున కేక వేసింది.

కెప్టెన్ లార్సన్ రెండుకళ్ళనూ దారుణంగా పొడిచేశా

రెవరో! "సీ డెవిల్" కెప్టెన్ గా అరివీర భయంకరుడని పేరుబడ్డ లార్సన్ పై ఈ అఘాయిత్యాన్ని ఎవరు తల పెట్టారు? నారాయణరావు అదే అడిగాడు.

"నా సోదరుడి నుంచి తప్పించుకో గలిగానన్న గర్వంతో నేను తెగ తాగి పడిపోయాను. అప్పుడే మీ ఇద్దరూ తప్పించుకుని వచ్చారట. ఆ విషయం తర్వాత తెలిసింది. మర్నాడుదయం నా నౌకను నా సోదరుడు మళ్ళీ ఆటకాయించాడు. నాతో విరోధం వున్న వ్యక్తులు గభాల్న అతడి పక్షం చేరిపోయారు.

"నా సోదరుడు నా కళ్ళు రెండూ పొడిపించేశాడు. నన్నొక్కడ్నే సీ డెవిల్ లో వదిలేసి, నా జనాన్నంతా తన స్టీమర్ లోకి మార్చాడు. సముద్రపు గాలుల దయా దాక్షిణ్యాలకు నన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. గత రెండు రోజులుగా వీచిన తుఫానులో నౌక మునిగిపోతుందనే అనుకున్నాను. కానీ నా కింకా భూమ్మీద ఆయుష్షు ఉన్నట్టుంది. నేను బ్రతికే వున్నాను, నౌక మునిగి పోలేదు."

తన విషాదగాథను ఏకరువు పెట్టాడు లార్సన్.

తాము తెచ్చుకున్న ఆహారంలోంచి లార్సన్ కి భోజనం పెట్టాడు నారాయణరావు.

"మిస్టర్ లార్సన్! తెరచార స్తంభం ఎక్కి తాళ్ళు సరిగా బిగిస్తే, మనం ఈ నౌకలో సుఖంగా ప్రయాణించ వచ్చు! ఏమంటావ్?" నారాయణరావు అడిగాడు.

"ఈ నౌకకు కెప్టెన్ ని నేను! ఇది నా స్వంతం. దీన్ని ఉపయోగించే అధికారం నీ కెవరిచ్చారు?" కెప్టెన్ లార్సన్ లో చింత చచ్చినా, పులుపు చచ్చినట్టు లేదు.

నారాయణరావు దిక్కులు పిక్కటిల్లేలా నవ్వాడు.

"నీదని దీనిమీద రాసిపెట్టి వుందా లార్సన్? నేను ఈ నౌకలోకి వచ్చినప్పుడు అయిదువందల రూపాయలు పోగొట్టుకున్నాను. దాన్ని థామస్ కాజేస్తే, అతడ్నించి పేకాటలో నీవు గెల్చుకున్నావ్! ఆ డబ్బు నాదేనంటే నీవానాడు ఏమన్నావో గుర్తుందా? నీదని ఎక్కడైనా రాసి వుందా అన్నావ్! పైగా బలం గలవాడిదే అధికారం అని బుకాయించావు. ఇప్పుడు, యిక్కడ నేను బలవంతుడ్ని. అధికారం నాది! దీన్ని ఒకరు ఇవ్వక్కర్లేదు. నాకై నేనే ఆ అధికారాన్ని హస్తగతం చేసుకుంటున్నాను!"

నారాయణరావు గబగబ తెరచాప స్తంభంమీదకు ఎగబ్రాకాడు. ఒక గంటసేపు పైన తిప్పలుపడి క్రిందకు దిగివచ్చాడు.

డెక్ మీద తెరచాప స్తంభం మొదట్లో కెప్టెన్ లార్సన్ చేతిలో కత్తిపట్టుకుని చేతికందిన తాడునల్లా కోసేస్తున్నాడు.

కళ్ళు పోయినా అతడి పాడుబుద్ధి రవంత మారలేదు.

"ఇదా నీ పన్నాగం! నీ రోగం నేను కుదురుస్తానులే!" అంటూ నారాయణరావు కెప్టెన్ లార్సన్ కాళ్ళు చేతులు బంధించాడు. తర్వాత భుజాన వేసుకుని అతడ్ని కేబిన్‌లోకి చేర్చాడు.

"నేను నౌక రిపేర్లు ముగించుకు వచ్చేదాకా ఇక్కడే పడి వుండు!" అంటూ తిరిగి నౌకలోకి చేరుకున్నాడు నారాయణరావు, అనితతో సహా.

మరో రెండుగంటలు కష్టపడ్డాక నౌక తెరచాపలు బాగయినయ్.

"మనం జపాన్ చేరగలిగితే చాలు. అక్కడ భారత రాయబార కార్యాలయంలో మా నాన్న స్నేహితు డున్నాడు. అతడి సాయంతో మనం జపాన్ చూడొచ్చు. తిరిగి ఏ ఇబ్బందీ లేకుండా ఇండియా చేరతాం!" అంది అనిత ఉషారుగా.

ఇద్దరూ తిరిగి ఒడ్డుకు వచ్చారు.

టెంట్‌లో కెప్టెన్ లార్సన్ లేడు. అతడేమైనాడా అని చుట్టూ కలయజూశాడు నారాయణరావు.

లార్సన్ కోపంతో తనున్న చోటునుంచి ఇసుకలో దొర్లుకుంటూ పోయాడు, కాళ్ళూ, చేతులూ బంధింపబడి ఉండటంవలన.

అయితే అతడికి దృష్టి లేకపోవటంవల్ల అతడు ఎక్కడికి పోతున్నదీగూడ తెలియకుండా దొర్లుకుపోయాడు.

ఇసుకలో సీల్ జంతువుల గుంపు చెర్లాటలాడుకుంటు న్నయ్. ఆ గుంపులోకి దొర్లుకుపోయాడు లార్సన్.

అతడి కళ్ళల్లోంచి ఇంకా కారుతున్న రక్తపు వాసనను అవి పసిగట్టినయ్. ఒకదాన్నొకటి త్రోసుకుంటూ వచ్చి, అతడి మీదపడి, తీర్గా అతడ్ని ఆరగించసాగినయ్.

నారాయణరావు తిరిగి వచ్చేసరికి కెప్టెన్ లార్సన్ అస్థిపంజరం మాత్రమే మిగిలి ఉంది.

జరిగిన సంఘటనకు ఇద్దరూ నిశ్చేష్టులై పోయారు.

ఏ సముద్రపు కుక్కలనయితే వేటాడుతూ మృగ ప్రాయంగా దయాదాక్షిణ్యాలు లేని రాయిగా గడిపాడో

కెప్టెన్ లార్సన్, అదే సముద్రపు కుక్కలచేత నిర్దాక్షిణ్యంగా చంపబడ్డాడు.

"అసలు అతగాడికి నా చేతిలో చావు రాసిపెట్టి ఉందనుకున్నాను. కానీ తన అమానుషత్వానికి తనే బలయిపోయాడు," నారాయణరావు కళ్ళనించీ కన్నీటి బొట్లు రాలలేదు.

టెంట్ ఎత్తేసి తమ సామానంతా 'సీడెవిల్'లోకి చేర్చారు అనిత, నారాయణరావులు. మరో అరగంటలో 'సీడెవిల్' జపాన్ వైపు పయనం సాగించింది.

—: ఐపోయింది :—